
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ఏలూరు

జిల్లా వార్తలు

5

మంగళవారం 21 జనవరి 2025

కమల సారథి ఎవరు ?

బీజేపీ జిల్లా అధ్యక్ష రేసులో ఐదుగురు

భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడిని నేడు ఎంపిక చేయబోతున్నారు. సుదీర్ఘ కసరత్తు అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా అధ్యక్షులను ఎంపిక చేయనుండగా ఏలూరులో అధ్యక్ష స్థానం కోసం సీనియర్ల మధ్య పోటీ ఉంది. ఇప్పటికే బూత్, మండల స్థాయిలో కమిటీల ఎన్నికలు దాదాపు పూర్తికాగా ఆ తదుపరి అధ్యక్షుడి ఎంపిక ఏకగ్రీవ నిర్ణయంతో పూర్తి చేయాలని బీజేపీ భావిస్తోంది.



విక్రమ్ కిశోర్, ఇందుకూరి చక్రవర్తి వర్మ, కట్నేని కృష్ణప్రసాద్, కారంకి శ్రీనివాస్, పెనుమత్స రామచంద్రరాజు

ఇప్పటికే పార్టీపరంగా అభిప్రాయ సేకరణ | పోటీ తీవ్రం..నేడు పార్టీ పెద్దలతో సమావేశం | ఏకాభిప్రాయం తరువాతే అధ్యక్షుడి ఎంపిక

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : భారతీయ జనతా పార్టీ జిల్లా సారథి పదవి కోసం హోరాహోరీ పోటీ నెలకొంది. ఇంతకుముందు ఎన్నడూ లేని విధంగా పార్టీ సీనియర్లు బరిలో ఉన్నారు. గడిచిన రెండు నెలలుగా భారతీయ జనతా పార్టీ సంస్థాగత ఎన్నికలు బూత్ స్థాయి నుంచి మండల స్థాయి వరకు కొన సాగుతూ వచ్చాయి. గతంలోనూ ఎక్కడికక్కడ ఈ కమిటీలకు సారథ్యం వహించేందుకు పెద్దగా ఎవరూ ముందుకు రాకపోతే చురుగ్గా ఉన్న వారిని పార్టీ నాయ కత్వం నామినేట్ చేసేది. కానీ ఇప్పుడు మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రత్యేకించి కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడం పార్టీ నేతల మధ్య పదవుల పోటీ పెంచినట్టయ్యింది. జిల్లా అధ్యక్షుడిగా ఇప్పటికే చింతలపూడి నియోజకవర్గానికి చెందిన సీహెచ్ విక్రమ్ కిషోర్ ఉన్నారు. ప్రతీ మూడేళ్ళకోసారి జిల్లా అధ్యక్షుడితో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకోవడం బీజేపీలో ఆనవాయితీ. అయితే ఇప్పటిదాకా అధ్యక్షుడిగా విక్రమ్ కిషోర్ ఏడాదిన్నరపాటు మాత్రమే ఆ పదవిలో ఉన్నారు. ఇదే తరుణంలో జాతీయ, రాష్ట్రస్థాయిలో సంస్థాగత ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన దగ్గర నుంచి ముగిసే నాటికి ఏక పద్ధతిలో సంస్థాగత ఎన్నికలు పూర్తి చేయాలని నిర్ణయించారు. దాదాపు అన్ని జిల్లాల అధ్యక్ష ఎంపికలు ఇదే ప్రక్రియలో కొనసాగుతాయి. దీంతో మిగతా జిల్లాల మాదిరిగానే ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షుడిని ఎన్నుకోవాల్సి ఉంది. ఈ దశలో గడిచిన పక్షం రోజులుగా మండలాలకు ఎన్నికైన అధ్యక్షుల నుంచి అభిప్రాయ సేకరణ చేశారు. జిల్లా పార్టీ పగ్గాలు ఎవరికి అప్పగిస్తే సమర్థవంతంగా నిర్వహిస్తారో అభిప్రాయాలను సేకరించి క్రోడీకరించారు. ఆ మేరకు ఎక్కడికక్కడ మండల పార్టీ అధ్యక్షులు కూడా తమ అభిప్రాయాలను పార్టీ జోనల్ ఇన్‌చార్జ్‌లకు తెలియజేశారు. ప్రస్తుత జిల్లా అధ్యక్షుడుగా కొనసాగుతున్న విక్రమ్ కిషోర్‌తో పాటు మరికొందరి నేతల పేర్లను కొందరు బహిర్గత పరిచారు. మరికొందరు సీని యర్లు జిల్లా అధ్యక్ష పగ్గాలు చేపట్టాలని ఆతృతతో ఉన్నారు. ఈ మేరకు మండల పార్టీ అధ్యక్షులను ప్రసన్నం చేసు కునేందుకు ప్రయత్నించారు. పార్టీకి, కార్యకర్తలకు నిర్విరామ సేవలు కొనసాగాలన్నా, అందుబాటులో ఉండాలన్నా తమ కున్న అర్హతలను వివరించే ప్రయత్నం చేశారు.

ఈ ఐదుగురిలో ఎవరికి ఛాన్స్ ?

ఏలూరు జిల్లా బీజేపీ అధ్యక్ష పదవి కోసం ఐదుగురు సీనియర్ల మధ్య తీవ్ర స్థాయిలో పోటీ నెలకొంది. అగ్రనాయకత్వం దగ్గర నుంచి క్షేత్రస్థాయి వరకు అందరి మన్ననలు పొంది మంచి మార్కులు దక్కించేందుకు ఇప్పటిదాకా విశ్వ ప్రయత్నాలు చేశారు. ప్రత్యేకించి భార తీయ జనతా పార్టీ సంస్థాగత ఎన్నికల స్వరూపాన్ని ఈసారి ఒకింత మార్చడంతో ఆది నుంచి అప్రమత్తంగానే ఉన్నారు. ఇప్పటికే జిల్లా అధ్యక్షునిగా విక్రమ్‌కిశోర్, ప్రధాన కార్యదర్శిగా కృష్ణప్రసాద్ కొనసాగుతున్నారు. వీరిద్దరు తాజాగా జరగబోయే అధ్యక్ష స్థానం పోటీలో నేరుగా ఢీకొంటున్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన విక్రమ్ కిశోర్ గత ఏడాదిన్నర క్రితమే ఈ పదవికి ఎన్నికయ్యారు. ఆయనతోపాటు జిల్లా కార్యవర్గం కూడా ఎన్నికైంది. అయితే తనకు మరో ఛాన్స్ ఇవ్వాలని మూడేళ్ళ పదవీ కాలం ఉండగానే ఏడాదిన్నరలోపే ఎన్నికలు నిర్వహించాల్సి రావడంతో తాను నష్టపోతున్న విషయాన్ని పార్టీ నేతల వద్ద ప్రస్తావించినట్టు చెబుతున్నారు. భారతీయ జనతా పార్టీలో క్రమశిక్షణకు పెద్ద పీట వేస్తున్న తరుణంలో ఎలాంటి వివాదాలు లేకుండానే స్నేహపూరిత వాతావరణంలో తంతు ముగించాలని నేతలు భావిస్తున్నారు. జిల్లా అధ్యక్ష స్థానం కోసం చాన్నాళ్ళుగా పోటీ పడుతున్న మరో నేత, ప్రస్తుత జిల్లా కార్యదర్శి కృష్ణప్రసాద్ ఈసారి అధ్యక్షస్థానం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. గడిచిన రెండు దఫాలుగా ఆయన ఈ స్థానం కోసం ప్రయత్నించగా ఒకసారి సుధాకర్ కృష్ణ, మరొకసారి విక్రమ్ కిశోర్‌ను జిల్లా అధ్యక్ష స్థానం వరించాయి. ఇప్పటికే పార్టీలో చురుగ్గా వ్యవహరిస్తున్న ఆయన తనకున్న కేడర్, బలం, పార్టీలో పట్టు వీటన్నింటినీ క్రోడీకరించి మరీ పోటీలో ఉన్నారు. కృష్ణప్రసాద్ కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు. ఇంతకుముందు సీనియర్ నేత కావూరి సాంబశివరావుకు ముఖ్య అనుచరుడు. ప్రస్తుతం జిల్లా ప్రధాన కార్యదర్శి పదవితో పాటు ఏలూరు పార్లమెంటు కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇక్కడి నుంచి ఇదే జిల్లాలో సీనియర్ అయిన తపన చౌదరితోపాటు ఆయన అనేక కార్యక్రమాల్లో కీలక పాత్ర వహించారు. ఆయన సామాజిక వర్గం నుంచి మరికొందరు ఇతర జిల్లాల్లో పోటీ పడుతున్నారు. ఈ నేపథ్యంలో కృష్ణప్రసాద్‌కు ఈసారి అవకాశం వస్తుందా ? రాదా అనేది నేడు తేలిపోనుంది. ఇదిలా ఉండగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఉన్న కొయ్యలగూడేనికి చెందిన బీసీ సామాజిక వర్గం నుంచి కారంకి శ్రీనివాస్ కూడా తనకో ఛాన్స్ ఇవ్వాలని గట్టిగానే కోరుతున్నారు. ఇంతకుముందు పార్టీలో తాను పోషించిన పాత్రను గుర్తు చేస్తున్నారు. ఈ ముగ్గురితోపాటు ఉంగుటూరు నియోజకవర్గానికి చెందిన మరో ఇద్దరు సీనియర్ నేతలు సైతం అధ్యక్ష పదవి రేసులో ఉన్నారు. గణప వరానికి చెందిన చక్రవర్తివర్మ ఇందుకూరితో పాటు పెన్మత్స రామ చంద్రరాజు (దుబాయ్ రాజు) బరిలో ఉన్నారు. ఇద్దరు క్షత్రియ సామాజిక వర్గానికి, ఎస్సీ, బీసీ, కమ్మ సామాజిక వర్గాల నుంచి ఒక్కొక్కరు పోటీలో నిలిచారు. వీరిలో కృష్ణప్రసాద్, విక్రమ్‌కిషోర్, కారంకి శ్రీనివాస్‌లలో ఒకరికి ఛాన్స్ దక్కబోతుందని పార్టీలో బలంగా వినిపిస్తున్నది.

నేడు ఏలూరులో పార్టీ వర్గాల భేటీ

జిల్లా అధ్యక్ష స్థానానికి పోటీ పడే వారి సంఖ్య పెద్ద సంఖ్యలో ఉండడం ఆ పార్టీలోనే అందరిని విస్తుపోయేలా చేస్తున్నది. ఏకాభిప్రాయంతో వీరందరి మధ్య సయోధ్య కుదిర్చి వీరిలో ఒకరిని అధ్యక్షుడిగా ప్రకటించేందుకు నేడు ఏలూరులో పార్టీ ముఖ్యులు సమావేశం అవుతారు.అశోక్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఈ సమావేశం జరగనుండగా, అందరి దృష్టి అవైపే మళ్లింది. పార్టీ పరి శీలకులు సమావేశానికి హాజరవుతారు. వివిధ సామాజిక వర్గాల మధ్య సమతుల్యత సాధించేలా నిర్ణయాలు ఉంటాయని పార్టీ నేతలు భావిస్తున్నారు.

రేపటి నుంచి జేఈఈ మెయిన్స్

పరీక్ష ప్రారంభ సమయానికి అరగంట ముందే గేట్ క్లోజ్



ఏలూరు అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా ఐఐటీలు, ఎన్‌ఐటీల్లో అడ్మిషన్లకు నిర్వహించే జేఈఈ మెయిన్స్ తొలి సెషన్ ఆన్‌లైన్ (సీబీటీ) పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. జిల్లాకు సంబంధించి ఈ పరీక్షలు ఏలూరు శివారులోని సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, సిద్దార్థ క్వెస్ట్ సీబీఎస్‌ఈ స్కూలు, మెయిన్ బైపాస్‌రోడ్డు దుగ్గిరాల పరిధిలోని ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లలో నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు సెషన్స్‌లో జరుగుతాయి. తొలి సెషన్‌లో ఈనెల 22, 23, 24 తేదీల్లో జరిగే పరీక్షలకు సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు ఉదయం, సాయంత్రం 120 మంది విద్యార్థులు చొప్పున, వట్లూరు సిద్దార్థ క్వెస్ట్ స్కూలుకు పూటకు 180 మంది చొప్పున కేటాయించారు. 28, 29, 30తేదీల్లో జరిగే పరీక్షలకు ఇవే కేంద్రాలకు అదనంగా మెయిన్ బైపాస్ రోడ్డు సమీపంలో వున్న దుగ్గిరాలలోని ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో కూడా పూటకు వందమంది విద్యార్థులు వంతున పరీక్షలు జరుగుతాయి. ఈ మూడు కేంద్రాల్లో జేఈఈ మెయిన్స్ పరీక్షలకు సుమారు 5 వేలమంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆయా కేంద్రాల వారీగా కేటాయించిన తుది పరీక్షార్థుల సంఖ్య మంగళవారం ఖరారవుతుంది. 22 నుంచి 29 వరకు పేపర్-1 (బీఈ/బీటెక్) పరీక్షలు, 30న పేపర్-2 (బీఆర్క్, బీప్లానింగ్)పరీక్ష జరుగుతుంది. ఈ పరీక్షలకు ఎన్టీయే ఆధ్వర్యంలో టీసీఎస్ సంస్థ నిర్వహిస్తుంది.

అరగంట ముందే 'గేట్ క్లోజ్' నిబంధన

ఈ దఫా జెఈఈ మెయిన్స్ పరీక్షలకు 'గేట్ క్లోజ్ టైం ' నిబంధనను పరీక్ష నిర్వహణ సంస్థ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీయే) అమల్లోకి తెచ్చింది. పరీక్షలు ప్రారంభమయ్యే సమయానికి అరగంటముందే పరీక్షకేంద్రం మెయిన్ గేట్‌ను మూసివేస్తారు. అంటే ఉదయం 8.30 గంటలకు, మధ్యాహ్నం పరీక్షకు 2.30 గంటలకు ముందుగానే విద్యార్థులు లోపలికి వెళ్ళిపోవాలని తర్వాత ఖచ్చితంగా ప్రధాన ప్రవేశ ద్వారాన్ని మూసివేస్తామని వెల్లడించారు. 'గేట్ క్లోజ్ టైం' తర్వాత వచ్చినవారిని కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. పరీక్షార్థులు తమ అడ్మిట్‌కార్డు, రెండు పాస్‌పోర్టుసైజు ఫోటోలు, దరఖాస్తు చేసినపుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన ఫోటో గుర్తింపుకార్డు ఒరిజినల్ కాపీ, ఒక పెన్ తప్పనిసరిగా తీసుకురావాలని కోరారు. ఎలక్ట్రానిక్ వస్తువులేవీ తీసుకు రావద్దని సూచించారు. పరీక్షలకు సిటీ కో-ఆర్డినేటర్‌గా పి.సాయికుమారి శంకర్, ఎన్టీయే తరపున జిల్లా నోడల్ ఆఫీసర్‌గా కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ వ్యవహరిస్తారు.

సమగ్రశిక్ష ప్రక్షాళనపై కలెక్టర్‌కు ప్రతిపాదనలు

ఏలూరు అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టులో ప్రభుత్వ అనుమతులు, కొనసాగింపు ఉత్తర్వులు లేకుండా దీర్ఘకాలంగా కొనసాగుతున్న వివిధ సెక్టోరల్, అసిస్టెంట్ సెక్టోరల్ అధికారులు, ఇతర విభాగాల ఉద్యోగులను తొలగించి వారిస్థానే కొత్తగా నోటిఫికేషన్ విడుదల చేయడం ద్వారా నియామకాలు చేపట్టేందుకు ఉద్దేశించిన ఫైళ్ళను ఎస్ఎస్ఏ ఏపీసీ పంకజ్‌కుమార్ కలెక్టర్‌కు సమర్పించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న సంబంధిత సిబ్బంది గురించి ఏపీసీతో చర్చించినట్టు సమాచారం. ఇదే విషయమై ఏపీసీ మాట్లాడుతూ సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టులో నియామకాలు చేపట్టవలసి వున్న సీఎంవో, ఏఎస్‌వో, అసిస్టెంట్ ఏఎంవో (ఉర్దూ) పోస్టుల భర్తీతో పాటు గవర్నమెంట్ నుంచి ఎక్స్‌టెన్షన్ లేకుండా వివిధ పోస్టుల్లో కొనసాగుతున్న వారినందరినీ వెనక్కి పంపాలని అభ్యర్థిస్తూ కలెక్టర్‌కు నోటిఫికేషన్ ప్రతిపాదనలను అందజేశామన్నారు. కొద్దిరోజుల్లోనే ఎస్ఎస్ఏ జిల్లా ప్రాజెక్టు మొత్తాన్ని ప్రక్షాళన చేయనున్నట్టు వెల్లడించారు.

గ్రామాలను దత్తత తీసుకోండి

అధికారులకు కలెక్టర్ వెట్రిసెల్వి పిలుపు

ఏలూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సమస్యలను పరిష్కరించడానికి ఒక గ్రామాన్ని జిల్లా, మండల స్థాయి అధికారులు దత్తత తీసుకుని మార్పు చూపిస్తే ప్రజలు మిమ్మల్ని గుండెల్లో పెట్టుకుంటారని కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో సోమవారం జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డితో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆయా గ్రామాల్లో విద్య, వైద్యం, ఉపాధి, పారిశుధ్యం, మంచి నీరు, మౌలిక సదుపాయాలు, అక్షరాస్యత పెంపుదలకు కృషి చేస్తే మార్పు తథ్యమని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన సంక్షేమ కార్యక్రమాలపై సర్వే చేయాలని, అనంతరం గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి అంశాలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. గ్రామాల్లో నిరుద్యోగ యువత వివరాలను సేకరించి, వారికి అభిరుచి కలిగిన అంశాల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలన్నారు. సమావేశంలో డీఆర్వో విశ్వేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, జడ్పీ సీఈవో కె.సుబ్బారావు, ఆర్డీవో అచ్యుత అంబరీష్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సోలార్ వెండర్స్‌తో సమావేశంలో ఎస్ఈ

పీఎం సూర్యఘర్‌తో విద్యుత్ బిల్లులు ఆదా

ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ సాల్మన్‌రాజు

ఏలూరుసిటీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని దీని వల్ల విద్యుత్ ఆదా అవుతుందని ఏపి ఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీర్ సాల్మన్‌రాజు చెప్పారు. ఏలూరు ఆర్‌ఆర్‌పేట విద్యుత్ భవన్‌లో రిజిస్టర్డ్ సోలార్ వెండర్లతో నిర్వహించిన సమావేశంలో సాల్మన్‌రాజు మాట్లాడుతూ సోలార్ రూఫ్‌టాప్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యుత్ వినియోగదారులకు త్వరితగతిన సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేయాలన్నారు. సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసేటప్పుడు ఎదురయ్యే అవరోధాలను సమీక్షించి అప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలన్నారు. బ్యాంకుల నుంచి రుణ సౌకర్యం పొందగోరే విద్యుత్ వినియోగదారులకు చక్కని సహకారం అందించాలన్నారు. లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని తక్కువ సమయంలో వీలైనంత ఎక్కువ సోలార్ రూఫ్‌టాప్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఏలూరు డివిజన్ ఈఈ కెఎం అంబేద్కర్, ఈఈ టెక్నికల్ రాధాకృష్ణ, ఏలూరు జిల్లా సోలార్ నోడల్ అధికారి రమాదేవి, 18 కంపెనీలకు చెందిన సోలార్ వెండర్స్ , విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

ప్రతీ అర్జీకి పరిష్కారం చూపాలి

ఏలూరు రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) ద్వారా అందిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ సమస్యలపై ప్రజలు నుంచి అర్జీలు స్వీకరించారు. 247 అర్జీలు అందినట్లు కలెక్టర్ వెల్లడించారు. అర్జీల పరిష్కారం తీరును సీఎంవో కార్యాలయ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పరిశీలిస్తామన్నారు. జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో విశ్వేశ్వర రావు, ఏలూరు ఆర్డీవో అత్యత అంబరీష్, డీఆర్డీఏ పీడీ విజయరాజు, స్పెషల్ కలెక్టర్లు ముక్కంటి, కె.భాస్కర్ అర్జీలు స్వీకరించారు.



బాధితుల గోడు వంటున్న కలెక్టర్ వెట్రిసెల్వి

సైబర్ నేరగాళ్ల వలలో పడవద్దు

ఏలూరు క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరగాళ్లు తెలివిగా పలు రకాలుగా మభ్యపెడతారని ఇలాంటి వారి మాటలు నమ్మవద్దని జిల్లా అదనపు ఎస్పీ సూర్యచంద్రరావ సూచించారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో 40 ఫిర్యాదులను స్వీకరించారు. వాటి పరిష్కారానికి అప్పటికప్పుడే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఎవరికి కూడా ఓటీపీ నెంబర్లు చెప్పవద్దన్నారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలన్నారు.

దివ్యాంగ పింఛన్ అందజేయండి



పెదవేగి మండలం తాళ్ల గోకవరం చెందిన తిరుపతి కూలిపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ఏడాది క్రితం కూలిపనికి వెళ్ళి ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి పడిపోయాడు. అప్పటి నుంచి అతడికి రెండు కాళ్లు పనిచేయకుండా పోయాయి. మంచానికే పరిమితం అయ్యాడు. దివ్యాంగ పింఛన్ కోసం దరఖాస్తు చేసినా రాకపోవడంతో తనకు పింఛన్ మంజూరు చేయాలంటూ స్ట్రెచర్ మీదే ఉండి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి కలెక్టర్‌ను వేడుకున్నాడు.

పది విద్యుత్ మీటర్లు ఉన్నాయని పథకాలకు దూరం !



ఉండటానికి సరైన గూడు కూడా లేదు. ఒక కాంప్లెక్స్ ఉందని దాంట్లో 10 విద్యుత్ మీటర్లు ఉన్నాయన్న కారణంతో ప్రభుత్వ పథకాలకు అందడం లేదని తన పేరిట ఉన్న విద్యుత్ మీటర్లు తొలగించాలని కోరుతూ ఏలూరు దక్షిణపు వీధికి చెందిన పోకల నాగమణి కలెక్టర్‌ను వేడుకుంది. ఇప్పటి వరకు ఒక్క ప్రభుత్వ పథకం అందుకోలేదని కారణం ఏమిటని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లగా తన పేరున పది విద్యుత్ మీటర్లు ఉన్నట్లు చూపుతోందన్నారు. తన సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేసింది.

విధివంచిత బాలలకు ఆసరా వాత్సల్య



ఐసీడీఎస్ ప్రాజెక్టు ద్వారా నెలకు రూ.4 వేలు

ఏలూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో తల్లిదండ్రులు దూరమై నిస్సహాయస్థితిలో ఉన్న పిల్లలు, తల్లి లేదా తండ్రిని కోల్పోయిన చిన్నారుల బతుకు దుర్భరం. భార్య భర్తల మధ్య గొడవల కారణంగా ఆత్మహత్యకు పాల్పడటం, కక్షలతో ఒకరిని ఒకరు చంపుకోవడం, ఇతర కారణాలతో ఒంటరి జీవితాలను గడుపుతున్న బాలలకు, యువతకు ప్రధానమంత్రి మిషన్ వాత్సల్య బతుకుపై కొత్త ఆశలను కల్పిస్తోంది. కుటుంబానికి ఆధారమైన పెద్ద ఎవరైనా కోల్పోతే ఆ కుటుంబానికి తీరని లోటు. ఇది ఆ కుటుంబంలోని బాల్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అలాంటి కుటుంబాల్లోని 0 నుంచి 18 ఏళ్లలోపు వారికి మిషన్ వాత్సల్య అండగా నిలుస్తోంది. జిల్లా మహిళా, శిశుసంక్షేమ శాఖ ద్వారా అమలు చేస్తున్న 2023 ఆర్థిక సంవత్సరం నుంచి ఈ పథకం మూడేళ్ల క్రితం కూడా కరోనాతో అసువులు బాసిన కుటుంబంలోని చిన్నారులను ఆదుకొంది. జిల్లాలో కరోనాతో అనాధలుగా మారిన పిల్లలకు ఏడుగురికి, అనాధలు 85 మంది, కుటుంబంలో తల్లి లేదా తండ్రి ఆసరాతో జీవిస్తున్న 315 మంది, హెచ్‌ఐవీ బాధితులు ఏడుగురు, మానసిక దివ్యాంగులకు ముగ్గురికి ఈ పథకం కింద ఆర్నెళ్లకు ఒకసారి రూ.24 వేల చొప్పున అందిస్తున్నారు.

441 మందికి రూ.కోటి 76 లక్షలు

బాలలు కుటుంబాన్ని విడిచిపెట్టి ఏదైనా ఇనిస్టిట్యూట్, ప్రభుత్వ, ఇతర పాఠశాలల్లో చేరినప్పుడు ఈ పథకం వర్తింపచేస్తారు. పిల్లలు 30 రోజులకు మించి పాఠశాలకు హాజరు కాకపోతే స్పాన్సర్‌షిప్ నిలిపి వేస్తారు. ఈ పథకానికి అర్హులైన పిల్లలు భవిష్యత్‌లో ఏదైనా హాస్టల్‌లో చేరితే అక్కడ నుంచి పథకాన్ని నిలుపుదల చేస్తారు. స్పాన్సర్‌షిప్ కమిటీ ప్రతీ సంవత్సరం ఈ పథకాన్ని సమీక్షించి జిల్లా కమిటీ స్పాన్సర్‌షిప్‌ను రిలీజ్ చేస్తుంది. పిల్లలకు నెలకు రూ.4 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని కేంద్ర స్త్రీ,శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అందిస్తున్నారు. జిల్లాలో పారదర్శకంగా ఈ పథకం అమలు చేస్తున్నామి జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శారద తెలిపారు. గతేడాది 441 మందికి 1 కోటి 76 లక్షలు అందజేశాం. వివిధ కారణాల రీత్యా 24 మందికి రద్దు చేశాం.. ఇక కొత్తగా దరఖాస్తులను స్వీకరించడం లేదని, వస్తే రాష్ట్ర కార్యాలయానికి పంపుతున్నట్లు వివరించారు.

ముందు చూపు పథకం ఇది



ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముందు చూపుతో పేదలకు ఆసరాగా అమలు చేస్తున్న పథకం ఇది. ఎందరో విధివంచితులైన బాలలకు ఇది చాలా ప్రయోజనకరం. కేంద్రం కూడా తన వంతుగా సహాయాన్ని జిల్లా ప్రాజెక్టులకు అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వాలను మంచి పథకాల్లో భాగస్వామ్యం వహించేలా చూస్తున్నారు.

- నడపన దాన భాస్కరరావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి



చారిత్రక ఆనవాళ్లకు సమాధి

పోలవరం ముంపులో రుద్రమ్మకోట

మూడు వేల ఏళ్ల నాటి చరిత్రకు చెల్లు

ఆది మానవులు నడిచినట్టు నిర్ధారణ

ఆ రాతి నిర్మాణాలే.. సమాధులు

త్వరలో ఈ ఊరికి జల సమాధి

ఆ ఊరి పేరు రుద్రమ్మకోట. ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలోని గోదావరి తీర గ్రామం. మూడు వేల సంవత్సరాల క్రితం ఆది మానవులు ఇక్కడ సంచరించిన ఆనవాళ్లు ఉన్నాయి. చనిపోయిన వారికి సమాధులు ఉన్నాయి. వీటిని పురావస్తు శాఖ నిర్ధారించింది. ఈ చారిత్రక గ్రామం పోలవరం ప్రాజెక్టు రాకతో పూర్తిగా మునిగిపోనుంది.

-వివరాలు ..6లో

గాలికి వదిలేశారు!


గాలి గోపురంపై మొలిచిన మొక్కలు

పాలకొల్లు అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పంచారామ క్షేత్రాల్లో ఒకటైన శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయ గాలి గోపురంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఎంతో ప్రసిద్ధిచెందిన ఆలయ గాలిగోపురం నిర్వహణా లోపం కారణంగా మొక్కలు పెరిగిపోతున్నాయి. రావి మొక్కలు పెరిగిపోవడంతో గాలి గోపురానికి పెను ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ఏర్లు పెరిగిపోతే బీటలు వారే అవకాశం ఉంది. ప్రతీ ఏటా పెరిగిన మొక్కలను తొలగించడం ఆనవాయితీ.. అయితే ఏడాది దాటినా మొక్కలను తొలగించకపోవడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రంగులు వెలసిపోవడంతో గోపురం కళ తప్పింది. కనీసం శివరాత్రి నాటికైనా మొక్కలు తొలగించి గోపురానికి రంగులు వేయించాలని భక్తులు ఆలయ అధికారులను కోరుతున్నారు.

జాతి వైరం మరచి.. అమ్మయింది...!


కుక్క వద్ద పాలు తాగుతున్న పిల్లిపిల్ల

ద్వారకాతిరుమల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జాతి వైరాన్ని మరచి ఓ శునకం పిల్లిపిల్లను తన పొత్తిళ్లలో చోటివ్వడం చూపరులను ఆశ్చర్యగొలుపుతోంది.. ద్వారకాతిరుమల శివారు వసంత్ నగర్ కాలనీలో ఓ ఇంటి వద్ద శునకం ఇలా పిల్లిపిల్లను కంటికి రెప్పలా సాకుతోంది. దానికి తనవద్ద పాలు కూడా పట్టించడంతో స్థానికులు ఆశ్చర్యపోతున్నారు. సహజ సిద్ధంగా ఈ రెండు జంతువులకు పరస్పర వైరం ఉంటుంది. పిల్లిని చూసిన వెంటనే శునకం దానిపై దాడికి ప్రయత్నిస్తుంది. అయితే ఇక్కడ దానిపై కూర్చోపెట్టుకోవడంతో పాటు ఏకంగా తనవద్ద పాలు పట్టించడాన్ని పలువురు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

ఊరా కప్ అంపైరింగ్‌కు నాగేంద్ర సింగ్ ఎంపిక


ఎంపికైన నాగేంద్ర సింగ్

ఏలూరు రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : ఆల్ గుజరాత్ స్టేట్ ఎలక్ట్రిసిటీ కార్పొరేట్ క్రికెట్ టోర్నమెంట్‌కు అంపైర్ నాగేంద్రసింగ్‌ను ఎంపిక చేసినట్టు ఊరా కప్ సమన్వయకర్త యోగేష్ షిండే ఆదేశాలు జారీ చేశారు. గుజరాత్ ఎలక్ట్రిసిటీ ఉత్పత్తిదారులు ఈపోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అదానీ, రిలయన్స్, టాటా పవర్, గుజరాత్ ఎలక్ట్రిసిటీ బోర్డు లాంటి దిగ్గజాలు హాజరుకానున్నాయి. ఈ నెల 24 నుంచి బరోడాలో ఈ టోర్నమెంట్ జరగనుందని అంపైర్ సింగ్ తెలిపారు.

దార్శిక్‌కు ఎన్టీఆర్ స్టార్ కప్



స్టార్ కప్ అందుకుంటున్న దార్శిక్

పాలకొల్లు టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు పట్టణానికి చెందిన ఆరేళ్ళ బాలుడు ఈలప్రోలు దార్శిక్ ఎన్టీఆర్ స్టార్ అవార్డును అందుకున్నారు. విజయవాడ ఇందిరా గాంధీ స్టేడియంలో ఆదివారం జరిగిన సౌత్ ఇండియా సీనియర్, జూనియర్ టెన్నిస్ టోర్నమెంట్‌లో జూనియర్ అండర్ 8విభాగంలో రన్నర్‌గా దార్శిక్ నిలిచినట్టు కోచ్ కిరణ్ సోమవారం తెలిపారు. అవార్డును అందుకున్న దార్శిక్‌ను టౌన్ హాల్ అధ్యక్ష, కార్యదర్శులు పోలిశెట్టి రాధాకృష్ణ ముచ్చర్ల ఆదినారాయణ, సీనియర్ టెన్నిస్ క్రీడాకారులు కొటికలపూడి కృష్ణ బోళ్ళ సుభాష్ చంద్రబోస్, రావూరి రామ్మోహన్ తదితరులు అభినందించారు.

కురులు విప్పిన.. సిరులు..

» ద్వారకా తిరుమల చిన్న వెంకన్న ఆలయంలో లక్షల సంఖ్యలో భక్తులు తలనీలాల సమర్పణ » కేటగిరిని బట్టి ధరలు.. వేలం ద్వారా కోట్ల ఆదాయం

దేవదేవుని ముందు అంతా సమానమే.. అందుకే చిన్నా, పెద్దా, పేద, ధనిక అనే భేదాలను విడనాడి స్వామిని సేవించి ఆధ్యాత్మిక చింతనలో మైమరచిపోతుంటారు స్వామి భక్తులు, దేవదేవుని నిండైన దీవెనలు అందుకుంటూ ఆత్మ శుద్ధి పొందుతుంటారు. దర్పం, హుందా తనంగా భావించే శిరులను దేవదేవునికి అర్పించి తనలోని భక్తిని చాటుకుంటూ పాపాల ముడిని స్వామికి సమర్పించి భారాన్ని దింపుకుంటారు. తప్పులు చేయకుండా కాచి కాపాడాలని, నిండు నూరేళ్ల పాటు సకల సంపదలు సమకూర్చాలని నిండు మనస్సుతో వేడుకుంటారు. ఎంతో భక్తి శ్రద్ధలతో సమర్పించే ఈ తల నీలాలు ఆలయాల అభివృద్ధికి సిరులు కురిపిస్తున్నాయి... విగ్గుల కోసం వినియోగించే ఈ శిరోజాలు కేజీ ధర వేలల్లో పలుకుతూ ఏటా కోట్లాది రూపాయల ఆదాయాన్ని సమకూరుస్తున్నాయి. ఈ అంశంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం మీ కోసం..

- ద్వారకాతిరుమల, (ఆంధ్రజ్యోతి)





చినవెంకన్నకు భక్తులు సమర్పించే కురులు సిరులు కురిపిస్తున్నాయి. తమ ఇష్టదైవానికి తలనీలాల సమర్పించడాన్ని భక్తులు అత్యంత పవిత్రంగా భావిస్తారు. ముఖ్యంగా ఏడు కొండలవానికి తలనీలాలు సమర్పిస్తూ దేవదేవుని నిండైన దీవెనలు అందుకుంటున్నారు. ఇందు కోసమే ప్రముఖ క్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి శేషాచలం ఘాట్ రోడ్డులో కోట్లాది రూపాయలు వెచ్చించి దేవస్థానం కల్యాణ కట్టను నిర్మించింది. ఇక్కడే దేవదేవుని తలనీలాల మొక్కును భక్తులు చెల్లించుకుంటారు. ఈ ప్రదేశాన్నే కల్యాణకట్ట అని పిలుస్తారు.. హిందూ సంప్రదాయం ప్రకారం శుక్ర, శనివారాల్లో క్షురకర్మ చేయించుకోవడం అపచారంగా భావిస్తారు.. అలాగే సూర్యోదయం తర్వాత మధ్యాహ్న సమయాల్లోనూ క్షురకర్మ చేయించుకోరు ఇది తరతరాల నుంచి వస్తున్న సంప్రదాయం. అయితే శ్రీనివాసుని సన్నిధి నిత్యకల్యాణం.. పచ్చతోరణం.. ఇక్కడ అలాంటి నియమాలు ఉండవు కాబట్టే ఇది కల్యాణకట్టగా ప్రసిద్ధి చెందింది.

పాపాలను దూరం చేసే శ్రీవారు...

పేద, ధనిక అనే భేదం లేకుండా నిత్యం ఏడుకొండలపై తలనీలాలు సమర్పించే భక్తులతో కల్యాణకట్ట కళకళలాడుతూ ఉంటుంది. భక్తుల నుంచి తలనీలాలు తీసుకుని వారి పాపాలు పోగొట్టే శ్రీనివాసుడు కలియుగ ప్రత్యక్ష దైవం గాను, ఆపదమొక్కులవాడిగాను ఖ్యాతి గాంచారు. కోరిన కోర్కెలు తీర్చి భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లే చినవెంకన్నను దర్శించుకునే యాత్రికులు నిత్యం వేలల్లో ఉంటారు. అందుకే విరాళాలు, టిక్కెట్ల రూపంలో ఆర్జించే ఆదాయంతో పాటు భక్తులు తలనీలాల రూపంలో ఆదాయం సమకూరుస్తూ ఉంటారు. వీటి ద్వారా శ్రీవారికి ఏటా కోట్లాది రూపాయల మేర ఆదాయం అందుతోంది..

తలనీలాల వెనుక మర్మమేంటి?

హిందూ సంప్రదాయం ప్రకారం చిన్నా పెద్దా అనే భేదం లేకుండా తమ ఇలవేల్పునకు తలనీలాలు సమర్పించి దైవం ముందు వినమ్రతను చాటుకుంటారు. పురాణాల ప్రకారం మనిషి తన జీవిత కాలంలో చేసిన పాపాలు, అహంకారం శిరోజాలకు అంటి ఉంటాయని, అలాంటి శిరోజాలను స్వామికి సమర్పించి తాము చేసిన పాప కర్మలు తొలగి పోవాలని ఇలా చేస్తుంటారు. వివాహమైన మహిళ భర్త ఉండగా శిరోజాలను తొలగించడం హిందూ సంప్రదాయానికి విరుద్ధం. దీంతో మహిళలు మూడు కత్తెర్ల రూపంలో స్వామికి మొక్కుబడులు చెల్లిస్తుంటారు. శిరోజాలు మనిషి అందానికి ప్రతీక, హుందాగా భావిస్తారు. అలాంటి శిరోజాలను సమర్పించి స్వామి భక్తిని చాటుకుంటారు. కష్టాలు తీరిన వారు ఎంతో భక్తి శ్రద్ధలతో తలనీలాలు సమర్పించి తమలోని దర్పాన్ని, హుందా తనాన్ని దేవునికి అర్పిస్తున్నట్టు తలనీలాలు సమర్పిస్తారు. అలాగే తలవెంట్రుకల్లో పూర్వజన్మకు సంబంధించిన పాపాలు ముడిపడి ఉంటాయని అందుకే శిశువు జన్మించిన ఏడాది లోపే పిల్లలకు పుట్టువెంట్రుకలు స్వామికి సమర్పిస్తూ బిడ్డను దైవ ప్రసాదంగా భావిస్తారు.

తలనీలాలకు భలే డిమాండ్..

ప్రపంచ మార్కెట్‌లో తలనీలాలకు మంచి గిరాకీ ఉంది. దీంతో వివిధ ఆలయాల్లో వాటిని పోగుచేసుకుని విక్రయించే హక్కునకు ఏటా లేదా రెండేళ్లకోసారి బహిరంగ వేలం నిర్వహిస్తారు. ఈ క్రమంలో శ్రీవారి క్షేత్రానికి వచ్చి మొక్కుబడులు తీర్చుకున్న భక్తుల ద్వారా కోట్లాది రూపాయల మేర ఆదాయం సమకూరుతోంది.. శ్రీస్వామివారికి భక్తులు సమర్పించిన తలనీలల ద్వారా 2023 - 24 సంవత్సరానికి గాను 6 కోట్ల 30 లక్షల రూపాయల ఆదాయం లభించగా 2020-21లో 3 కోట్లు, 2021-22లో ఏకంగా 11 కోట్ల 97 లక్షలు లభించగా 2022-23 సంవత్సరానికి గానూ 6 కోట్ల 37 లక్షల రూపాయల ఆదాయం బహిరంగవేలాల ద్వారా సమకూరింది.

కేటగిరిని బట్టి ధర కేటాయింపు

భక్తులు సమర్పించిన తలనీలాలను వివిధ కేటగిరీల్లో విభజిస్తారు. జుట్టు పొడవు ఆధారంగా 5 అంగుళాల నుంచి 31 అంగుళాల వరకూ ఐదువర్గాలుగా విభజించి విక్రయాలు జరుపుతారు. వేలం వేసిన తర్వాత గుత్తేదారులు ఆ జుట్టును నిల్వ చేయడానికి ముందు పలు జాగ్రత్తలు తీసుకుంటారు. ముందుగా వాటిని ఉడకబెట్టి, కడిగి ఎండలో ఆరబెడతారు. ఆ తర్వాత బస్తాలలో నిల్వ చేసి వాటిని విక్రయిస్తారు. జుట్టు నాణ్యతను బట్టి ధర ఉంటుంది. నాసిరకం కేజీ 8 నుంచి 10 వేల రూపాయల వరకు ధర పలికితే నాణ్యమైన, పొడవైన జుట్టు కేజీ 20 నుంచి రూ.25 వేల రూపాయలు పైబడి ధర పలుకుతుందని వ్యాపారులు చెబుతున్నారు. వీటితో తయారు చేసే విగ్గులు వేల రూపాయలు పలుకుతాయి.. ఇతర దేశాల్లో సైతం డిమాండ్ ఉంటుంది.

కలల పంట..



డ్రాగన్ ఫ్రూట్ సాగు పట్ల రైతుల్లో ఆసక్తి - కేజీ రూ. 400 పై మాటే

తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు - పెరుగుతున్న సాగు



దెందులూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : పనిభారం లేకపోవడం పెట్టుబడితో పాటు సాగు నీటి అవసరం పెద్దగా లేకపోవడంతో రైతులు డ్రాగన్ ఫ్రూట్ పంట పట్ల ఆసక్తి చూపుతున్నారు. అలాగే మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో సాగు క్రమక్రమంగా పెరుగుతోంది. ఒక్కసారి పంట వేస్తే 32 సంవత్సరాల వరకు దిగుబడి వస్తుంది. ధర కలిసి రాకపోయినా ఏడాదికి కనీసం రెండున్నర లక్షలు సంపాదించుకోవచ్చు.. అందుకే రైతులు విపరీతంగా ఆసక్తి చూపిస్తున్నారు. గతంతో దెందులూరు నియోజకవర్గంలో ఈ పంట జోలి వెళ్లిన వారే లేరు.. ఇప్పుడు నియోజకవర్గంలో పేదవేగి, సూర్యరావుపేట, రాట్నాలకుంట, కన్నాపురం, దెందులూరు మండలంతో పాటు పలు గ్రామాల్లో సుమారు 180 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ పంట సాగు చేస్తున్నారు.

పోషకాల ఘని..

ఈ పండు వ్యాధి నిరోధక శక్తిని పెంచడంతో పాటు కిడ్నీ సంబంధిత వ్యాధులకు, అజీర్ణ సమస్యలకు బాగా పని చేస్తుంది. డ్రాగన్ ఫ్రూట్‌ను పిటాయా అని పిలుస్తారు. దీనిలో ఫైబర్ అధికంగా ఉంటుంది. కేలరీలు తక్కువగా ఉండటంతో పాటు మనిషి బరువు తగ్గడం, మధుమేహాన్ని అదుపు చేయడం, చర్మ సంరక్షణకు ఉపయోగపడే గుణం ఈ పండులో ఉంది. కరోనా తరువాత వీటిపై ప్రజలకు వాడకం పెరిగింది. దీంతో లాభాలు వస్తుండటంతో రైతులు కుడా పంటను పండించేందుకు ముందుకు వస్తున్నారు.

భూ పరీక్ష ప్రధానం...

దాదాపు ఎకరం భూమిని ముందుగా భూసార పరీక్షలు చేయించి నేలలో ఉదజని 7శాతం ఉంటే సరిపోతుంది. ముందుగా మడుసార్లు దుక్కుదున్నాలి. ఏడు అడుగుల ఎత్తున్న సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేసి మొదటి సారి ఎకరానికి అన్ని ఖర్చులతో కలిపి సుమారు 4 లక్షల రూపాయల వరకు పెట్టుబడి అవుతుంది. ఎకరా విస్తీర్ణంలో దాదాపు 500 సిమెంట్ స్తంభాలకు 1500 నుంచి 2 వేల మధ్య డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను పెంచవచ్చు. తరువాత సంవత్సరానికి 10 వేలు నుంచి 20 వేలు మాత్రమే పెట్టుబడి పెడితే సరిపోతుందని రైతులు చెబుతున్నారు.

పంట దిగుబడి...

సీజన్‌లో ఒక్కో చెట్టుకు కనీసం 15 నుంచి 18 పళ్ల కాస్తాయి. వీటిని కిలో 250 నుంచి 300 రూపాయల వరరకు మార్కెట్‌లో అమ్ముతారు. సీజన్లో కిలో 150 నుంచి 400 రూపాయల వరకు ఉంటుంది. సంవత్సరానికి రెండు పంటల చొప్పున 32 సంవత్సరాల వరకు రైతులు ఆదాయం తీస్తారు. ఇప్పుడు రైతుల వద్దకు వచ్చి డ్రాగన్ ఫ్రూట్‌ను ఒక్కొక్కటి వంద చొప్పున కొనుగోలు చేస్తున్నట్టు రైతులు చెబుతున్నారు. ఏలూరు, తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం పట్టణాల్లో మంచి డిమాండ్ ఉండటంతో రైతులు మార్కెట్‌లకు తరలిస్తున్నారు

పంటపై ప్రచారం అవసరం...



సాగు నీటి వినియోగం తక్కువ, పెట్టుబడి తక్కువ, నష్టాలు లేని పంటనే రైతులు ఎన్నుకోవాలి. అలాంటి కోవకు చెందిన పంటే డ్రాగన్ ఫ్రూట్.. ఈ పంటపై ప్రభుత్వం ప్రచారం చేయాలి. నేను ఈ పంట వేసినప్పుడు బయపడ్డాను. ఇప్పుడు ధైర్యంగా ఉంది.. ఎకరాకు రెండు లక్షల వరకు లాభం వచ్చింది.

గొరిపర్తి శ్రీనివాస్ (కొవ్వలి)

కోలమూరులో సురభి మాయాబజారుకు ఫిదా..


కోలమూరులో మాయబజారు నాటకాన్ని ప్రదర్శిస్తున్న దృశ్యం

ఉండి, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : మాయాబజార్ పౌరాణిక నాటకం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. సోమవారం ఉండి మండలం కోలమూరు గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మ ప్రసార పరిషత్ ఆధ్వర్యంలో శ్రీసంతాన గోపాలస్వామి దేవస్థానం కోలమూరు గ్రామంలో ముక్కోటి, ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా సురబి నాటకోత్సవాలను ఏర్పాటు చేసి ప్రారంభించారు. తెలంగాణ వనస్థలి పురానికి చెందిన ఆర్.వేణుగోపాలరావు శ్రీవినాయక నాట్యమండలి (సురభి) నేషనల్ థియేటర్ ఆర్.వేణుగోపాలరావు బృందంచే అద్భుతంగా మాయబజారు నాటకాన్ని ప్రదర్శించారు. ఈనాటకాన్ని తిలకించడానికి కోలమూరు నలుమూల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై నాటక కళాకారులను అభినందించారు. నాటకాలను ఆలయ కమిటీ అధ్యక్షులు బదిరీ నారాయణరాజు, కార్యనిర్వహణాధికారి మంతెన రామరాజు, రుద్దరాజు రవికుమార్ రాజు, నంబూరీ బలరామ రాజు, పేరిచర్ల శ్రీనివాస రాజు, ఆర్. అప్పలరాజు, ఆర్. నరసిం హరాజు, కెవిరాజు, ముదునూరి సతీష్ రాజులు నిర్వహించారు.

చారిత్రక ఆనవాళ్లకు సమాధి..

మూడు వేల ఏళ్ల నాటి చరిత్ర కాలగర్భంలో కలిసిపోనుంది. ఆదిమ మానవులు సంచరించిన ఆనవాళ్లు చూడలేమంటూ రుద్రమ్మ కోట గ్రామస్థుల కళ్లు చెమ్మగిల్లుతున్నాయి. పోలవరం ముంపుతో ఇక తమ గ్రామం కథలకే పరిమితమనే గ్రామస్థుల మాటలు గుండెల్లో భారాన్ని మరింత బరువెక్కిస్తున్నాయి...

పోలవరం ముంపులో రుద్రమ్మకోట గ్రామం

జరగబోయే ఘటనతో గ్రామస్థుల కంట నీరు

మూడు వేల ఏళ్ల నాటి చరిత్రకు చెల్లు


ఆదిమ మానవుల సమాధి


సమాధుల్లో లభించిన విలువైన పూసలు

వేలేరుపాడు, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే నిర్వాసితులకు జరిగే నష్టం అపారం.. ఇదే క్రమంలో వేల సంవత్సరాల చరిత్ర కలిగిన అనవాళ్ళు కూడా పూర్తిగా జలసమాధయ్యే ప్రమాదం ఉంది. చరిత్రకు ఆనవాళ్లుగా తమ గ్రామం నిలిచిందని ఆ గ్రామస్థులు అనేక సందర్భాల్లో సంతోషంతో పాటు విచారం వ్యక్తం చేస్తుంటారు. వాళ్ళ సంతోషాలు ఆవిరి చేస్తూ పోలవరం ప్రాజెక్టు తమను మింగేస్తుందని వాపోతున్నారు. మరికొద్ది కాలంలోనే ఆయా ప్రాంతమంతా జలమయం అయ్యి ఊళ్ళకు ఊళ్ళే మునిగిపోనున్నాయి. ఆ కోవలోనే రుద్రమ్మకోట గ్రామం కూడా ఉంది. ఈ గ్రామం ప్రత్యేకత ఏమిటంటే ఆదిమానవులు వేల సంవత్సరాల క్రితమే ఈ గ్రామంలో నివసించినట్లు ఆధారాలున్నాయి. అలాగే అనాటి మానవులకు సంబంధించిన అస్తికలు, వారు ఉపయోగించిన వస్తువులు వారి సమాధుల్లో లభ్యమయ్యాయి. ఇప్పుడు అవన్నీ కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడింది.

ఇదీ చరిత్ర...

మూడు వేల ఏళ్ళనాటి ఆదిమానవ ఆనవాళ్ళను పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలోని రుద్రమ్మకోట గ్రామం వద్ద పురావస్తు శాఖ నిపుణులు గుర్తించారు. 2018లో పురావస్తు శాఖ అధికారులు రుద్రమ్మకోట గ్రామ సమీపంలోని గుట్టల వద్ద అతిభారీ సమాధులను గుర్తించారు. ఈ సమాధుల్లో ఏముందో తెలుసుకునేందుకు తవ్వకాలు చేయగా అనేక విశేషాలతో కూడిన ఆదిమానవుల ఉనికికి సంబంధించిన వివరాలు బయటపడ్డాయి. క్రీస్తు పూర్వం 1750 నుంచి 2500 సంవత్సరాల మధ్యకాలంలో ఇనుము తొలిసారిగా ఉనికిలోకి వచ్చినట్లు ఇప్పటిదాక భావించారు. అయితే అంతకన్న 500 ఏళ్ళకు ముందే ఇనుప ఖనిజంతో చేసిన సాధనాలను వాడినట్లు సమాధుల్లో బయటపడ్డ ఇనుముతో తయారు చేసిన ఆయుధాల ద్వారా నిరూపితమైంది. ఆదిమానవులు గృహ అవసరాల కోసం వాడిని మట్టి పాత్రలు సమాధుల్లో దొరికాయి. వీటితో పాటే స్త్రీ, పురుష అలంకారాల కోసం వాడే పూసలు కూడా లభించాయి. ఇందులో అత్యంత విలువైన కార్నేలియాన్ జస్పాల్ అగేజ్‌పేస్ట్, ఐవరి, స్ఫటికమార్బుల్‌తో తయారు చేసినవి మంచి డిజైన్లతో ఈ పూసలు లభించాయి.

చరిత్ర చెప్పే సాక్ష్యాలు...

ఆనాటి ఆదిమానవులు భారీకాయులుగా ఉండే వారని నిర్ధారించేందుకు ఇక్కడ సమాధులను పరిశీలిస్తే అర్థమవుతోంది. చనిపోయినవారిని దహనం చేసిన తరువాత మిగిలిన అస్తికలు, వారువాడిన వస్తువులను ఆరడుగుల వెడల్పు, పది అడుగుల పొడవుగల సమాధులు నిర్మించి వాటిలో భద్రపరిచి రక్షణగా పెద్దబండరాయిని సమాధులపై ఉంచారు. ఇటువంటి సమాధులు అనేకం రుద్రమ్మకోట సమీపంలోని గుట్టల్లో దర్శనమిస్తున్నాయి. ఇంతటి చరిత్ర కలిగిన గ్రామం తన పూర్వపు వైభవాన్ని కోల్పోయే ప్రమాదం పోలవరం ప్రాజెక్టు ద్వారా పొంచి ఉంది.




ఆదిమ మానవులు వినియోగించిన ఇనుప ఆయుధం, మట్టి పాత్ర


శేషవాహనంపై కొలువై తిరువీధులకు బయలుదేరిన శ్రీవారు, అమ్మవార్లు.

ముగిసిన ద్రవిడ ప్రబంధ అధ్యయనోత్సవాలు

ద్వారకాతిరుమల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): వెండి శేషవాహనంపై ఉభయదేవేరులతో కొలువుతీరిన శ్రీవారు క్షేత్రపురవీధుల్లో ఊరేగారు. చిన్నవెంకన్న క్షేత్రంలో జరుగుతున్న ద్రవిడ ప్రబంధ అధ్యయనోత్సవాలు సోమవారం రాత్రి జరిగిన విశేష కార్యక్రమాలతో ముగిశాయి. ముక్కోటి ఏకాదశి పర్వదినం మొదలుగా ఈ ఉత్సవాలను దేవస్థానంలో పదిరోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయ ఆవరణలో జరిగిన పూజాధికాల అనంతరం స్వామి, అమ్మవార్లను వెండి శేషవాహనంపై ఉంచి అలంకరించి అట్టహాసంగా క్షేత్రపురవీధుల్లో ఊరేగించారు. తమ ఇంటి ముంగిటకు విచ్చేసిన స్వామి, అమ్మ వార్లకు భక్తులు హారతులు పట్టారు.

గిరిజన ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధికి కృషి

ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు


ఎస్టీ కమిషన్ చైర్మన్‌తో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, అధికారులు

పోలవరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ప్రాంతాల్లో పర్యాటక విస్తరణ చేయడం కోసమే పర్యటన చేస్తున్నట్లు ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు తెలిపారు. శనివారం రాజమహేంద్రవరం నుంచి పోలవరం ప్రాజెక్టుకి చేరుకున్న ఆయన అక్కడి నుంచి అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా పోశమ్మగండి ప్రాంతానికి చేరుకున్నారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, రంపచోడవరం సీఐ సాయి ప్రశాంత్, పోలవరం సీఐ బాల సురేష్‌బాబు, ఎస్ఐ పవన్ కుమార్ వారికి పూలబొకేలతో స్వాగతం పలికారు. అనంతరం చైర్మన్ ప్రత్యేక పర్యాటక బోటులో పాపికొండలకు తరలి వెళ్లారు. మార్గమధ్యలో పేరంటాలపల్లి శివక్షేత్రాన్ని సందర్శించిన అనంతరం నదీ తీరం వెంబడి ఉన్న గిరిజన గ్రామాల్లో పర్యటించి చైర్మన్ అక్కడి గిరిజనులతో మమేకవుతారని, అనంతరం భద్రాచలం, పర్ణశాల సందర్శిస్తారని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షులు గునపర్తి చిన్ని, ఆటపాకల వెంకటేశ్వరరావు, తెలగంశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగరాణి, కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి, మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎమ్మెల్యే రామాంజనేయులు తదితరులు

పెరుగుతున్న మధుమేహ కేసులు

అవగాహన లేకుంటే ప్రాణాపాయం.. భీమవరంలో ఉచిత వైద్య శిబిరం

భీమవరంటౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ వ్యాప్తంగా మధుమేహ కేసులు పెరిగిపోతున్నాయని, ఈ వ్యాధి గురించి అవగాహన లేక ప్రజలు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని పలువురు వక్తలు అన్నారు. భీమవరం డీఎన్నార్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఉప్పలపాటి వెంకట కృష్ణంరాజు మెమోరియల్ ఉచిత మెగా షుగర్ వ్యాధి చికిత్స శిబిరాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి, ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), పత్సమట్ల ధర్మరాజు, తెలంగాణ ఎమ్మెల్యే రమణరెడ్డి, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, లండన్ వైద్యులు కే.వేణు ప్రారంభించారు. దాదాపు రెండువేల మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ వేగేశ్న కనకరాజు సూరి, రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, జనసేన జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు, డీఎన్నార్ కళాశాల అధ్యక్షుడు గోకరాజు వెంకట నరసింహ రాజు, టీడీపీ రాష్ట్ర నాయకులు మెంటే పార్థసారథి, డాక్టర్ పీఆర్కే వర్మ, అల్లూరి సాయి దుర్గారాజు, పేరిచర్ల సుభాష్, గోకరాజు పాండు రంగరాజు, గోకరాజు రామరాజు (రామం) జిల్లా ప్రభాస్ ఫ్యాన్స్ అధ్యక్షుడు ఉండి వాసు పాల్గొన్నారు. దాదాపు 15 పైగా ఏర్పాటు చేసిన రూముల్లో రోగులకు వైద్యులు పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఎక్స్‌రేలు, రక్త పరీక్షలు ఉచితంగా చేశారు.

కాపులకు రిజర్వేషన్లు అమలు చేయాలి

సీఎం, డిప్యూటీ సీఎం లకు జోగయ్య బహిరంగ లేఖ

పాలకొల్లు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అగ్రవర్ణాల ఈడబ్ల్యుఎస్‌కి 10శాతం రిజర్వేషన్ కల్పిస్తూ 103వ రాజ్యాంగ సవరణ చేసిన దరిమిలా కాపు కులస్థులకు విద్య, ఉద్యోగాల్లో 10శాతం కోటాలో 5శాతం కలగజేస్తూ జగన్ పాలనకు ముందు అప్పటి సీఎం చట్ట సభల్లో ఆమోదించి గవర్నర్ ఆమోదం పొందటం జరిగిందని వాటిని యాథాతథంగా ఇప్పుడు అమలు చేయాలని మాజీ ఎంపీ, కాపు సంక్షేమ సేన అధ్యక్షుడు చేగొండి వెంటక హరిరామ జోగయ్య సోమవారం సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లకు బహిరంగ లేఖ రాశారు. ప్రతులను సోమవారం పాలకొల్లులో పత్రికలకు విడుదల చేశారు. ఈడబ్ల్యుఎస్ కోటాలో 5శాతం కాపులకు ఇవ్వాలని జీవో నెంబరు 45 2019 మార్చి 8వ తేదీన గెజిట్ పబ్లికేషన్ ఇవ్వటం జరిగిందని లేఖలో పేర్కొన్నారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్‌మోహన్‌రెడ్డి కక్షపూరిత ధోరణితో వ్యవహరించారని లేఖలో జోగయ్య పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తాను వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించానని తెలిపారు. 10శాతం కోటాలో 5శాతం కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులస్థులకు కేటాయించడం న్యాయ సమ్మతం కాదంటూ 14వ నెంబరు చట్టాన్ని కొట్టివేయాలంటూ అగ్రవర్ణాల వారు హైకోర్టులో వ్యాజ్యం వేశారని తెలిపారు. అయితే రాష్ట్రం మొత్తం జనాభాలో కాపు కులస్థులు 20శాతం ఉండగా మిగిలిన అగ్రకులాలు అన్నీ కలిపినా 25శాతం కూడా లేని మాట వాస్తవమని ఈ విషయాన్ని ప్రభుత్వం పరిశీలించాలని సూచించారు. ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ గత ప్రభుత్వం ఇచ్చిన కౌంటర్‌నే సమర్థిస్తూ మాట్లాడటం వల్ల కాపులకు రిజర్వేషన్ విషయంలో నేటి ప్రభుత్వం నిర్ణయం ఏమిటో ఈనెల 28వ తేదీన జరిగే విచారణలో తేటతెల్లం అవుతుందని పేర్కొన్నారు.



మ్యూజికల్ హిట్స్‌తో ఉర్రూతలు

భీమవరం టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మావుళ్ళమ్మ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి కోటికలపూడి గోవిందరావు కళావేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం 5 గంటలకు భీమవరానికి చెందిన వంశీ ఆర్కెస్ట్రా నిర్వహించిన సినీ మ్యూజికల్‌నైట్ ఆకట్టుకుంది. పలు చిత్రాల్లోని సినీ గీతాలను ఆలపించి ప్రేక్షకులను హుషారెత్తించారు. మధ్యాహ్నం మూడు గంటలకు జువ్వలపాలెంలోని బాలాంజనేయ భజన సమాజం వారిచే భజన, సాయంత్రం 4 గంటలకు అడబాల సత్యనారాయణమూర్తి కేశన పల్లివారిచే భక్తి రంజనీ, రాత్రి 8 గంటలకు మావుళ్ళమ్మ నాట్యమండలి వారిచే రంగస్థల ఆణిముత్యాలు ప్రదర్శించారు.

కోళ్లకు అంతుచిక్కని వైరస్



» గంటల వ్యవధిలోనే మృత్యువాత » కోళ్ల పెంపకందారుల ఆందోళన

పెంటపాడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కోళ్లకు అంతుచిక్కని వైరస్ పట్టి పీడిస్తున్నది. సాయంత్రం ఆరోగ్యంగా కనిపించే కోడి ఉదయానికి మృత్యువాత పడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలో కొన్ని రోజులుగా సుమారు లక్షకు పైగా కోళ్ళు మృత్యువాత పడినట్లు తెలుస్తోంది. సంక్రాంతి పండుగ సుమారు నెల రోజుల ముందు నుంచి అధిక సంఖ్యలో కోళ్ల మృత్యువాత పడుతున్నాయి. పందేల కోసం నెలల తరబడి కంటికి రెప్పలా పెంచిన పందెం కోళ్ల కూడా చాలా వరకు మృతి చెందాయి. కోళ్ల పెంపకందారులు లక్షల రూపాయలు నష్టపోయారు. కోళ్ల సంఖ్య తగ్గిపోవడంతో చాలా బరుల్లో పందేలు కూడా పస లేనట్లుగా సాగాయి. కనీసం జోడీలు కూడా దొరకలేదు.

నాలుగేళ్ళ క్రితం ఇదే వ్యాధి

కోళ్లకు వచ్చిన ఈ వ్యాధి కొత్తదేమి కాదు. నాలుగు సంవత్సరాల క్రితం ఈ వ్యాధి సోకి అనేక కోళ్లు మృత్యువాత పడ్డాయి. అప్పుడు ఎందుకు చనిపోతున్నాయో కూడా తెలియని అయోమయ పరిస్థితిలో పెంపకందారులు తీవ్ర ఆవేదన చెందుతూ వచ్చారు. వైరస్ సోకడంతో అమ్మకాలు కూడా గణనీయంగా తగ్గిపోయాయి. దీంతో ధరలు పూర్తిగా పతనమయ్యాయి. పెంపకందారులు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారస్తులు తీవ్రంగా నష్టపోయారు. వైరస్ తగ్గుముఖం పట్టడానికి అప్పుడు చాలా రోజులు సమయం తీసుకుంది. ఇప్పుడు మరలా అదే వైరస్ కోళ్లకు వచ్చినట్లుగా సంకేతాలు కనిపిస్తున్నాయి.

వైరస్ లక్షణాలు తెలియవు

ఈ వైరస్ సోకిన కోడికి వైరస్ లక్షణాలు ఏమీ కానరావు. ఉదయం బాగా ఉన్న కోడికి ఒకవేళ వైరస్ సోకితే తిరుగుతూనే చనిపోతుంది. ఈ వైరస్ నేరుగా కోడి గుండెపై ప్రభావం చూపుతుందని వైద్యులు చెబుతున్నారు. వైరస్ సోకిన కోడికి గుండెనిండా నీరు పట్టేయడం వల్ల గుండెపోటు లాంటిది సంభవించి చనిపోతుంది. ఒకవేళ వైరస్ సోకిన కోడిని కనిపెట్టి వ్యాక్సిన్ వేయించినా ఫలితం ఏ మాత్రం ఉండదు.

జిల్లాలో లక్షకు పైగా కోళ్లకు వైరస్

పశ్చిమగోదావరి జిల్లాలో కొన్ని రోజులుగా లక్షకు పైగా కోళ్లకు వైరస్ సోకినట్లు తెలుస్తోంది. దీంతో పెంపకం నిర్వాహకులు ఆర్థికంగా చాలా వరకు నష్టపోయారు. వైరస్ ఇంకా ప్రబలితే గతం మాదిరిగా ముందు ముందు కోడి ధరలు ఎక్కడ పతనమవ్వైపోతా యోనని పెంపకం దారులు ఆందోళన చెందుతున్నారు. ఈ కోళ్ల మాంసం తినకూడదని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు.

వైరస్ పరిధి మూడు కిలో మీటర్లు

వైరస్ సోకిన కోడి కారణంగా సుమారు 3 కిలోమీటర్ల దూరంలో ఉండే మరో కోడికి వైరస్ సోకే ప్రమాదం ఉందని వైద్యులు తెలిపారు. దీంతో ఈ వ్యాధి తీవ్రత ఎంతో దారుణంగా ఉందో తెలుసుకోవచ్చు. పౌల్ట్రీలో ఒక కోడికి వైరస్ సోకితే మిగిలిన అన్ని కోళ్లకు కూడా గంటల వ్యవధిలోనే వైరస్ సోకి కోళ్ల మొత్తం మృత్యువాత పడతాయి.


పెంటపాడు కాలువ వద్ద వైరస్‌తో మృత్యువాతపడ్డ కోళ్ళను సంచులలో కట్టి పడేసిన వైనం

రోడ్డు పక్కన కోళ్ల కళేబరాలు

వైరస్ కారణంగా మృత్యువాత పడిన కోళ్లను చాలా మంది సంచులలో వేసి రహదారుల పక్కనే పడేస్తున్నారు. ఇది చాలా ప్రమాదమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇలా చేయడం వల్ల చుట్టు పక్కల ఉండే కోళ్లకు అతి వేగంగా ఈ వైరస్ సోకే అవకాశం ఉందంటూ హెచ్చరిస్తున్నారు. వైరస్ కారణంగా కోళ్ల చనిపోతే వాటిని ఊరికి దూరంగా తీసుకువెళ్ళి కాల్చేయడం గాని లేదా సుమారు 3 అడుగుల గొయ్యిని తీసి అందులో సున్నం వేసి పూడ్చటం గాని చేయాలంటున్నారు. లేకపోతే చనిపోయిన కోళ్ల కారణంగా మరిన్ని కోళ్ల మృత్యువాత పడతాయంటూ హెచ్చరిస్తున్నారు.

నేడు ఉమ్మడిజిల్లా విద్యాధికారుల సమావేశం

ఏలూరు అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పాఠశాలవిద్యలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రవేశపెట్టడానికి ప్రభుత్వం ప్రతిపాదించిన ఐదురకాల బడులపై ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలతో మంగళవారం స్థానిక సీఆర్ఆర్ కళాశాల ఆడిటోరియంలో విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు సమావేశం నిర్వహిస్తున్నారు. ఉమ్మడిజిల్లాలోని ఐదు డివిజన్ల ఎంఈవోలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో వేర్వేరుగా సమావేశ మవుతారు. ప్రభుత్వ విద్యారంగానికి ఉపాధ్యాయులకు గత వైసీపీ ప్రభుత్వం అమ ల్లోకి తెచ్చిన జీవో 117పై ఏర్పడిన తీవ్ర వ్యతిరేకతల నేపథ్యంలో వివాదాస్పద ఈ జీవోను రద్దు చేస్తున్నట్టు ఇటీవల ప్రకటించిన కూటమి ప్రభుత్వం దానిస్థానే ప్రత్యా మ్నాయాలపై పలు ప్రతిపాదనలు చేసింది. ఇందులో భాగంగా ప్రస్తుతం వున్న ఆరురకాల బడులస్థానే ఐదురకాల బడులను క్లస్టర్ల వారీగా పంచాయితీని యూనిట్‌గా కొత్తగా ఏర్పాటుచేయతలపెట్టిన మోడల్ ప్రైమరీ స్కూళ్ళు, విద్యార్థుల సంఖ్యఆధారంగా ఏర్పాటయ్యే శాటిలైట్, ఫౌండేషన్, బేసిక్ ప్రైమరీ, ప్రస్తుత హైస్కూళ్ళగురించి ప్రభుత్వ ప్రతిపాదనలను ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు వివరించి, జిల్లాలో క్షేత్రస్థాయి ఏర్పాట్లు, సాధ్యాసాధ్యాల గురించి తెలుసుకుంటారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ప్రారంభ మయ్యే ఈ సమావేశం రాత్రి 7 గంటల వరకు కొనసాగే అవకాశం ఉంది.

ఈ సారి తెలంగాణలో బీజేపీదే అధికారం

కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి

భీమవరం టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : 'తెలంగాణాలో రాబోయే 45 నెలల్లో బీజేపీ అధికారంలోకి వస్తుంది రాసి పెట్టుకోండి' అని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. భీమవరంలో సోమవారం సినీ హీరో కృష్ణంరాజు జయంతి సందర్భంగా నిర్వహించిన సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి కేటీఆర్ తప్పొప్పులను కోర్టు నిరూపిస్తుందన్నారు. ఆయన క్రాస్ పిటిషన్ వేస్తే అది కొట్టేసిందని, సుప్రీం కోర్టుకు పోయినా కచ్చితంగా విచారణ చేయాలని చెప్పడంతో తప్పు జరిగినట్టు తెలుస్తోందన్నారు. తప్పుచేసినవాడు ఎంతటి వాడైనా శిక్షకు అర్హులని, ఇందులో రాజకీయ కక్షలు లేవన్నారు. కేటీఆర్ అధికారంలో ఉన్న పదేళ్లు ఎటువంటి వాతావరణాన్ని సృష్టించారు అనేది గ్రామాల్లోని ప్రజలందరికీ తెలుసు. కార్పొరేషన్ చైర్మన్‌లు మొదలుకొని స్పీకర్ వరకూ అందరూ విదేశీ పర్యటనలు చేస్తున్నారు. ఆ పర్యటన వల్ల వచ్చే లాభం ఎంతంటే పేపర్ మీద చూపించే తెలివి ఒక్కరికీ లేదని ఎద్దేవా చేశారు. పర్యటన చేసొచ్చారా.. ఇన్ని కోట్ల ఖర్చు అయినాయి, దీనికి వెయ్యింతలు అవకాశాలు, ఇండస్ట్రీస్ వచ్చాయి.. లాభాలు వచ్చాయని ఏదైనా ఇక్కడ చూపించారా అని ప్రశ్నించారు. ఎవరైనా చూపిస్తారా.. ఆ దమ్ము ధైర్యం ఉన్న వాడే విదేశీ ప్రయాణాలు చెయ్యాలని అన్నారు

మంత్రికి సహకార ఉద్యోగుల వినతి

ముదినేపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రా థమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరి ష్కరించాలని రాష్ట్ర సహకార శాఖ మంత్రి కిం జరాపు అచ్చెన్నాయుడును ఆ ఉద్యోగుల అసోసి యేషన్ నాయకులు కోరారు. సోమవారం మంత్రిని రాష్ట్ర సచివాలయంలో అసోసి యేషన్ ప్రధాన కార్యదర్శి బొల్లినేని రఘురామ్ ఆధ్వర్యంలో నాయకులు కలసి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగు లకు 2019, 2024 పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలని, 2019 ఏప్రిల్ 1 నుంచి సంఘాల్లో సిబ్బంది నియామకాలు నిలిచిపోయాయని, ప్రస్తుతం ఉన్న ఉద్యోగులను రెగ్యులర్ చేసి మిగిలిన ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

వృద్ధుల సమస్యలపై 371 ఫిర్యాదుల పరిష్కారం

ఏడీ రామ్‌కుమార్

ఆకివీడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వయోవృద్ధులకు సంబంధించి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 524 ఫిర్యాదులు నమోదు కాగా 371 కేసులు పరిష్కరించినట్టు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సహాయ సంచాలకులు రామ్‌కుమార్ తెలిపారు. ఆకివీడు వచ్చిన ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. విచారణ దశలో 153 దరఖాస్తులు ఉన్నాయన్నారు. వయోవృద్ధులు వారి పిల్లలకు తమ ఆస్తులు రాసి ఇచ్చినా సక్రమంగా చూడకుండా వేధిస్తున్న 36 మందికి సంబంధించి ఆస్తులను తిరిగి వెనక్కి రిజిస్ట్రేషన్ చేయించుకోవడం జరిగిందన్నారు. వివిధ స్వచ్ఛంద వృద్ధాశ్రమాల ద్వారా 180 మంది వృద్ధులకు పూర్తిస్థాయి ఆశ్రయం కల్పించడం జరుగుతుందన్నారు. వయోవృద్ధుల సంఘాల ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఇప్పటి వరకు అర్హులైన 11901 వయోవృద్ధులకు గుర్తింపు కార్డులు జారీ చేయడమైందన్నారు. వృద్ధులు తమ సమస్యలు తెలియజేయవచ్చునని తెలిపారు.

31 వరకు 'ఇగ్నో' కోర్సుల్లో ప్రవేశాలకు గడువు

ఏలూరు అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) దూరవిద్య, ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైందని స్థానిక సీఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రామరాజు, 'ఇగ్నో' స్టడీసెంటర్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్, డిప్లొమా, పీజీ డిప్లొమా, డిగ్రీ, పీజీ కోర్సుల్లో అడ్మిషన్లను ఇగ్నో వెబ్‌సైట్ లింక్‌ద్వారా ఈ నెల 31వరకు పొంద వచ్చునన్నారు. వివరాలకు స్టడీసెంటర్ ఫోన్ నెంబరు 94903 50469లో సంప్రదించాలన్నారు.

క్రైమ్ కార్నర్



ప్రియుడి ఇంటి ముందు ప్రియురాలి ధర్నా

బుట్టాయగూడెం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రియుడి ఇంటిముందు యువతి ధర్నాకు దిగిన సంఘటన బుట్టాయగూడెంలో జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాలు ప్రకారం.. బుట్టాయగూడెం అరుంధతిపేటకు చెందిన మర్రి ప్రణీత అదే గ్రామానికి చెందిన ఉందుర్తి నవీన్ కుమార్‌లు రెండు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. మైనార్టీ తీరేంత వరకు ప్రేమ వ్యవహారం సాగించాడని, మైనార్టీ తీరిన తర్వాత పెళ్ళి చేసుకుంటానని నమ్మించాడని తెలిపింది. ఇప్పుడు మైనారిటీ తీరిన యువతి పెళ్ళి చేసుకోమని అడగ్గా తన కుటుంబీకులు ఒప్పుకోవ డంలేదని చెబుతున్నాడని, పెళ్ళికి నిరాకరిస్తున్నాడని విలపించింది. తనపైన, తన తల్లి, పిన్ని పైన నవీన్‌కుమార్ కుటుంబీకులు దాడి చేశారని వివరించింది. తనను వదిలించుకునేందుకు కుట్ర చేస్తూ వేధిస్తున్నాడని వాపోయింది. తనను పెళ్ళి చేసుకునేంత వరకు నవీన్‌కుమార్ ఇంటి ముందు నుంచి వెళ్ళనని భీష్మించింది. న్యాయం జరిగేంత వరకు ఆందోళన కొనసాగిస్తానని ప్రణీత స్పష్టం చేసింది. బాధితురాలు ధర్నాకు దిగడంతో నవీన్‌కుమార్ కుటుంబీకులు ఇంటికి తాళం వేసి పరారైనట్లు సమాచారం. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.దుర్గా మహేశ్వరావు తెలిపారు. ఉదయం నుంచి ప్రణీత ఏమి తినకపోవడంతో నీరసించిందని కుటుం బీకులు ఆందోళన చెందుతున్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి


శ్రీనివాసరావు (ఫైల్)

ఏలూరు క్రైం/కామవరపుకోట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఒక యువకుడిని ఎదురుగా అతి వేగంగా వస్తున్న లారీ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పెదవేగి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన గోళ్ళ శ్రీనివాసరావు (31) సెంట్రింగ్ పనులు చేస్తూ తన తల్లిదండ్రులతో కలిసి జీవిస్తున్నాడు. అతనికి వివాహం కాలేదు. జంగారెడ్డిగూడెంలో సెంట్రింగ్ పనులు చేసే నిమిత్తం సోమవారం ఉదయాన్నే తన ఇంటి వద్ద నుంచి మోటారు సైకిల్‌పై బయలుదేరి జంగారెడ్డిగూడెం వెళ్తుండగా మార్గమధ్యలో తడికలపూడి సినిమాహాల్ దాటిన తరువాత మలుపు వద్ద ఎదురుగా అతి వేగంగా వస్తున్న లారీ శ్రీనివాసరావును ఢీకొంది. అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా కొద్ది సేపటికే మృతి చెందాడు. తడికలపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన లారీని స్టేషన్‌కు తరలించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాడేపల్లిగూడెం రూరల్ జనవరి 20 (ఆంధ్రజ్యోతి):తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెం వద్ద విశాఖ వైపు వెళ్లే రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్టు జీఆర్‌పీ ఎస్సై అప్పారావు తెలిపారు. మృతుడు 45 సంవత్సరాల వయస్సు కలిగి బ్లూ కలర్ బనియన్, బ్లాకలర్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడని వివరించారు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచినట్టు తెలిపారు. మృతుని వివరాలు తెలి సిన వారు తమను సంప్రదించాలని కోరారు.

చికిత్స పొందుతూ క్షతగాత్రుడి మృతి

జంగారెడ్డిగూడెం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 18వ తేదీన స్థానిక పద్మ థియేటర్ వద్ద ద్విచక్ర వాహనం ఢీకొట్టిన ఘటనలో పట్టణానికి చెందిన మడ్డి దుర్గారావు (45)తీవ్రంగా గాయపడ్డారు. జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్ళగా చికిత్స పొందుతూ 19వ తేదీ సాయంత్రం మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సి.ఉమా మహేశ్వరరావు తెలిపారు.


ఎక్స్‌రేలో కనిపిస్తున్న బాలుడి గొంతులో ఇరుక్కున్న నాణెం

బాలుడి గొంతులో నాణెం తొలగింపు

ఏలూరు అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : నగరానికిచెందిన ఓ బాలుడు(8) పది రూపాయల నాణేన్ని ఆదివారంరాత్రి మింగివేయడంతో గొంతులో ఇరుక్కుపోయింది. కుటుంబీకులు హుటాహుటిన స్థానిక ఆయుష్ హాస్పిటల్‌కు తీసుకువచ్చారు. డాక్టర్ వెంకట జయదీప్ నేతృత్వంలోని వైద్యబృందం ఆదివారం అర్థరాత్రి సమయంలో ఎండోస్కోపి ద్వారా నాణేన్ని విజయవంతంగా బయటకు తీశారు. ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్న బాలుడిని రక్షించినందుకు ఆయుష్ ఆస్పత్రి వైద్యులకు తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పీక కోసి హత్యాయత్నం



గణపవరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన బొడ్డి కృష్ణను గుర్తు తెలియని వ్యక్తులు చాకుతో పీక కోసి హత్యాప్రయత్నం చేసిన సంఘటన గణపవరం మండలం ముగ్గళ్ళ గ్రామ శివారులో జరిగింది. గణపవరం ఎస్సై మణికుమార్ తెలిపిన వివరాల ప్రకారం బొడ్డు కృష్ణను హత్య చేయాలనే తలంపుతో ఆయన్ను ఆదివారం రాత్రి సుమారు 10గంటలకు ముగ్గళ్ళ గ్రామ శివారులోకి తీసుకొచ్చి చాకుతో పీకకోసి పరారయ్యారు. రక్తగాయాలతో కొట్టుమిట్టాడుతున్న కృష్ణను దారినపోయే వ్యక్తుల సాయంతో 108ద్వారా తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కృష్ణ వాంగ్మూలం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బాలికను వేధిస్తున్న మైనర్‌పై పోక్సో కేసు

ద్వారకాతిరుమల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఓ మైనర్ బాలికను ప్రేమిస్తున్నానని పలుసార్లు అత్యాచారం చేసిన ఓ మైనర్ బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ టి సుధీర్ తెలిపారు. మండలంలోని ఒక గ్రామానికి చెందిన మైనర్ బాలిక జంగారెడ్డిగూడెంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈక్రమంలో అదే కాలేజీలో అదే క్లాసు చదువుతున్న జంగారెడ్డిగూడెం మండలానికి చెందిన మైనర్ మాయమాటలు చెప్పి పలుసార్లు అత్యాచారం చేశాడు. దీనిపై బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వాసుపత్రిలో వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం


వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి

ఏలూరు క్రైం/ఏలూరు కార్పొరేషన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మెరుగైన ఆహార నియమాలే ఆరోగ్య సంరక్షణకు ప్రాథమిక సూత్రాలు అని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలోని వెల్‌నెస్ క్లినిక్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. కమ్యూనిటీ మెడిసన్ హెచ్‌వోడీ వెల్‌నెస్ క్లినిక్ ఇన్‌ఛార్జి ప్రొఫెసర్ డాక్టర్ గంగాభవానీ మాట్లాడుతూ ప్రతి సోమ, బుధవారాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు క్లినిక్‌లో కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ పి.సావిత్రి, వైస్ ప్రిన్సిపాల్ కె.భాస్కర్, ప్రొఫెసర్ డాక్టర్ ఎం శశిధర్, ప్రొఫెసర్ డాక్టర్ ఎం.సత్య నారాయణరావు, కో-ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, ఎస్ఎంఆర్ పెదబాబు, టీడీపీ నాయకులు బెల్లంకొండ కిషోర్, బొద్దాని శ్రీనివాస్, కమ్యూనిటీ మెడిసిన్ అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతుబజార్లతో మెరుగైన సేవలు

నగరంలోని రైతుబజార్ల ద్వారా రైతులు, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. సోమవారం పత్తేబాదలోని రైతుబజారును ఆయన పరిశీలించారు. కూరగాయల దుకాణాలు, పరిసరాలను పరిశీలించారు. కొనుగోలు దారులతో రైతుబజార్లు ద్వారా అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాయితీ బియ్యం కూడా సక్రమంగా అందించాలన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం నాయుడు, టీడీపీ నాయకులు నాయుడు సోము, బెల్లంకొండ కిషోర్, కంప్యూటర్ ప్రసాద్, బొద్దాని శ్రీనివాస్, ఆర్ఎస్ఆర్ నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

అనారోగ్య బాధితులకు అండగా సీఎం సహాయనిధి


బూత్ ఏజెంట్లకు నియమాక పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి/పెదపాడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా ఉంటుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో అనారోగ్యం బారిన పడి చికిత్స చేయించుకున్న బాధితులకు రూ.10లక్షల విలువైన చెక్కులను అందించారు. పార్టీ నాయకులు యూఎస్.రామ్‌ప్రసాద్, బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మేకా కనకరాజు, మంచినేని శ్రీనివాసరావు, గారపాటి రామసీత, మాగంటి నారాయణప్రసాద్, లావేటి శ్రీనివాస్, నంబూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్ బూత్ ఏజెంట్ల నియమాకం

ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల కూటమి బలపర్చిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీలో పేరాబత్తుల రాజశేఖరానికి మద్దతుగా నియోజకవర్గానికి సంబంధించి పోలింగ్ బూత్ ఏజెంట్లకు నియమాక పత్రాలను ఎమ్మెల్యే ప్రభాకర్ అందించారు. దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం సంబంధిత పత్రాలను అందజేశారు. నియోజకవర్గంలో మొత్తం 6,500 మంది ఓటర్లు ఉండగా, ఆయా ఎమ్మెల్సీ పోలింగ్ బూత్‌లకు 11 మంది ఏజెంట్లను నియమించారు. వీరికి ఎన్నికల్లో పాటించాల్సిన పలు అంశాలపై సూచనలు చేశారు. పార్టీ సీనియర్ నాయకులు ఉప్పలపాటి రాంప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


ఆందోళన చేస్తున్న సొసైటీ ఉద్యోగులు

ఏలూరు రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏపీ స్టేట్ అగ్రికల్చరల్ కోపరేటివ్ సొసైటీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయు) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులు ధర్నాలో పాల్గొన్నారు. ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, గ్రాట్యుటీ చెల్లించాలని, పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని నినదించారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ, రాష్ట్ర నాయకుడు గంగరాజు, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణలు మాట్లాడుతూ 2019లో జారీ చేసిన జీవో నెంబర్ 36ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు రాజు, సీహెచ్ సుందరయ్య, కె.విజయలక్ష్మీ, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్‌లు మాట్లాడారు. ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికు వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు సుబ్బారావు, వీరయ్య, రాధాకృష్ణ, సర్వేశ్వరరావు, వలీ, అమర్నాథ్, తదితరులు నాయకత్వం వహించారు.

'పంగిడిగూడెం భూమి లబ్ధిదారులకు న్యాయం చేయాలి'

ఏలూరు రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ద్వారకా తిరుమల మండలం పంగిడిగూడెం డి.ఫారం భూమి లబ్ధిదారులకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. ఏలూరు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె శ్రీనివాస్, జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు మాట్లాడారు. లబ్ధిదారుల పేరున భూమి ఆన్‌లైన్ చేసి పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని నినాదాలు చేశారు. 2005లో పేదలకు డి-ఫారం పట్టా భూములు 25 సెంట్లు చొప్పున పంపిణీ చేశారని గుర్తు చేశారు. ఆ భూములు ఆన్‌లైన్ చేయకపోవడంతో వ్యవసాయ పెట్టుబడి సాయం, పంట రుణాలు, ఇతర వ్యవసాయ ప్రభుత్వ పథకాలు వీరికి అందడం లేదన్నారు. పంగిడిగూడెం డి-ఫారం భూముల లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. ధర్నా అనంతరం జేసీ ధాత్రిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. పి.సుభాష్ చంద్రబోస్, మానుకొండ వీర్రాజు, వి.కొండమ్మ, డి.లక్ష్మీ, ఎల్.కనకమ్మ, బి.కుమారి, డి.ఏసమ్మ పాల్గొన్నారు.


ఏలూరు పట్టణ స్వర్ణకారుల సహకార సంఘ కార్యవర్గ సభ్యులు

స్వర్ణకారుల సహకార సంఘ ప్రమాణ స్వీకార మహోత్సవం

ఏలూరురూరల్, జనవరి20 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు పట్టణ స్వర్ణకారుల సహకార సంఘం ప్రమాణ స్వీకార మహోత్సవం సోమవారం స్థానిక కల్యాణ మండపంలో జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బడే టి చంటి హాజరై మాట్లాడారు. స్వర్ణకారుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. స్వర్ణకారుల సంఘం భవన నిర్మాణానికి తన వంతు సహాయం చేస్తానని, అర్హులైన వారికి పింఛన్లు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా స్వర్ణకారుల నూతన కార్యవర్గ అధ్యక్షుడు బొద్దూరి నాగభూషణం, ప్రధాన కార్యదర్శి చిట్టూరి త్రినాథ్, కోశాధికారి వీర్ని రాజేష్, వైస్ ప్రెసిడెంట్లు షేక్ అహ్మదుల్లాబేగ్, డొంకా లక్ష్మీకాంతి, జాయింట్ సెక్రటరీ లంకపల్లి శివ, నల్లమాటి రాజేష్, గౌరవ సంఘ సభ్యులు మునినాడ సత్యనారాయణ, లకోజు కొండ, ఉమామహేశ్వరరావు, తదితర కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

ఎక్సైజ్ దాడులు
ముగ్గురు మహిళలపై కేసు

చింతలపూడి/లింగపాలెం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ప్రగడవరం, వేములపల్లి గ్రామాల్లో సారాపై దాడులు జరిపి ఇరువురి మహిళల నుంచి సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. ప్రగడవరంలో కొనకళ్ళ జయమ్మ నుంచి రెండు లీటర్లు, వేములపల్లికి చెందిన నత్తా రాములమ్మ నుంచి పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. లింగపాలెం మండలం వేములపల్లి గ్రామానికి చెందిన మహిళ సారా అమ్ముతున్నట్టు సమాచారంతో దాడి చేశామని ఎక్సైజ్ ఎస్ఐ ఆర్‌వీ ఎల్ నరసింహారావు తెలిపారు. ఆమెను అరెస్టు చేసి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడులలో ఎస్ఐతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి : ఎస్ఐ

పెదపాడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, అది వారు సురక్షితంగా గమ్యం చేరుకోవడానికి సహకరిస్తుందని పెదపాడు ఎస్ఐ కట్టా శారదసతీష్ తెలిపారు. పెదపాడు బస్టాండ్ సెంటర్‌లో సిబ్బందితో వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ ధరించని, వాహనాలకు సంబంధించి సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులకు ఈ-చలానా రూపంలో జరిమానాలు విధించారు. ఎస్ఐ సతీష్ మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరణలో పోలీసులకు తగువిధంగా సహకరించాలని కోరారు. అతివేగంగా ప్రయాణించడం వల్ల జరిగే ప్రమాదాల్లో కొన్నిసార్లు ప్రాణాపాయం జరుగుతుందని, వాటిని నివారించాలని వాహనదారులను కోరారు. వాహన తనిఖీల్లో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లు నిర్మించారు.. డ్రైనేజీలు మరిచారు..

- రహదారిపై పొంగి పొర్లుతున్న మురుగు నీరు
- ద్వారకానగర్ దుస్థితి ఇది..


ద్వారకానగర్‌లో రోడ్డుపైకి చేరిన మురుగునీరు

ద్వారకాతిరుమల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కొన్ని చోట్ల సీసీ రోడ్లు నిర్మించినా.. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. డ్రెయినేజీలు నిర్మించక పోవడంతో మురుగు నీరు రోడ్లపైకి పొంగిపొర్లుతోంది. అటు వాహనదారులతో ఇటు గృహయజమానులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఎం.నాగులపల్లి పంచాయతీ ద్వారకానగర్‌లో ఇటువంటి సమస్యతో స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ద్వారకానగర్‌లో సీసీ రోడ్లు నిర్మించినా పక్కనే డ్రెయినేజీలను నిర్మించలేదు. మురుగునీరు రోడ్డుపై ప్రవహించడంతో దుర్వాసన వెదజల్లుతోందని రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. రోగాలు ప్రబలుతున్నాయని ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పార్టీల పేరుతో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించొద్దు


డీఎస్పీ రవిచంద్ర

ఏలూరు జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పార్టీల పేరుతో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర హెచ్చరించారు. సోమవారం జంగారెడ్డిగూడెం డీఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. లక్కవరంలో ఈనెల 18వ తేదీ అర్ధరాత్రి ఓ తోటలో జరిగిన పార్టీ రేవు పార్టీ అంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. తోటలో మందు పార్టీతో పాటు పలువురు యువతులతో డాన్స్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తమకు అందిన సమాచారంతో జంగారెడ్డిగూడెం సీఐ కృష్ణబాబు, లక్కవరం ఎస్ఐ శశాంక దాడులు నిర్వహించగా అప్పటికే డాన్స్ ప్రోగ్రాం ముగియగా యువతులు అక్కడి నుంచి వెళ్ళిపోయారని తెలిపారు. అనధికార మద్యం(తెలంగాణ) కలిగి యుండడం, అనుమతి లేకుండా యువతులతో డాన్స్ ప్రోగ్రాం ఏర్పాటు చేసినందుకు ఆరుగురు యువకులను అరెస్టు చేసి వారిపై కేసులు నమోదు చేసి కోర్టుకు తరలించగా కోర్టు వారికి రిమాండ్ విధించినట్లు తెలిపారు. వారి నుంచి ఐదు కార్లు, మూడు బైక్‌లను స్వాధీన పరచుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

ఖోఖోలో భారత జట్టు విజయంపై హర్షం

ఏలూరు రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఖోఖో ప్రపంచ కప్ పోటీల్లో విజేతలుగా నిలిచిన భారత జట్లకు ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ బోర్డు జోనల్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు హర్షం ప్రకటించారు. ఢిల్లీ వేదికగా జరిగిన ఖోఖో ప్రపంచ కప్ పోటీల్లో విజేతగా నిలవడం, మొట్టమొదటి ఖోఖో ప్రపంచకప్ పోటీల్లో భారత మహిళలు, పురుషుల జట్లు నేపాల్ జట్లను చిత్తు చేసి విశ్వవిజేతలుగా నిలవడం గొప్ప విషయం అన్నారు.

మద్ది దేవస్థాన మాజీ చైర్మన్ వీర్రాజు రెడ్డి మృతి


వీర్రాజు రెడ్డి (ఫైల్)

ఏలూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం మండలం మద్ది ఆంజనేయ స్వామి దేవస్థానం అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ దల్లి చిన వీర్రాజురెడ్డి (75) ఆదివారం రాత్రి మృతి చెందారు. సోమవారం గురవాయిగూడెంలోని ఆయన ఇంటి వద్ద పలువురు రాజకీయ నాయకులు, రైతులు వీర్రాజు రెడ్డి పార్థీవ దేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.


కూరగాయలు అమ్ముతున్న ఐసీఆర్‌పీలు

సేంద్రియ కూరగాయలతో మంచి ఆరోగ్యం

లింగపాలెం, జనవరి20 (ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగు మందులు వాడని కూరగాయలతో మంచి ఆరోగ్యం సాధ్యమని ఏవో కోటగిరి మురళీకృష్ణ అన్నారు. లింగపాలెంలో ఆర్గానిక్ పద్ధతిలో పండించిన కూరగాయల అమ్మకం సోమవారం ప్రారంభించారు. పురుగుమందులు వాడకుండా సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయల వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయని అన్నారు. ఐసీఆర్‌పీలు గుర్రాల విజయలక్ష్మి, జాన్సీ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం గోంగూర, కొత్తిమీర, పాలకూర లాంటి ఆకుకూరలు బెండకాయలు, వంకాయలు, అరటికాయలు వంటి కూరగాయలు పండిస్తున్నామని, సేంద్రియ పద్ధతిలో మరిన్ని కూరగాయలు పండించేలా చూస్తామన్నారు. ప్రజలు తమ ఇంటివద్ద ఖాళీ స్థలాల్లో సేంద్రియ పద్ధతిలో కూరగాయలు పండించుకోవచ్చన్నారు.

నేడు మంత్రి పార్థసారథి పర్యటన

ఏలూరురూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి మంగళవారం పోణంగి, కొమడవోలు, చొదిమెళ్లలోని ఎన్‌టీఆర్ గృహ లేఅవుట్‌లను పరిశీలిస్తారు. స్థానిక ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్యతో కలిసి పర్యటించనున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రభుత్వాసుపత్రి డ్రెయిన్లలో పూడికతీత


డ్రెయిన్లను శుభ్రపరుస్తున్న పారిశుధ్య కార్మికులు

ఏలూరు క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఏలూరులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని మురుగునీరు ప్రవహించడానికి సరైన డ్రెయినేజీ నిర్మాణం లేకపోవడంతో ఎక్కడ నీరు అక్కడ నిలిచిపోతుండడంతో అంటువ్యాధులు ప్రబలే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆసుపత్రిలోని మురుగునీరు ఒక నూతిలోకి పంపించి అక్కడ నుంచి ఆసుపత్రి బయట ఉన్న ప్రధాన డ్రెయిన్లకు తోడించేవారు. ప్రస్తుతం అక్కడ మోటారు పాడైపోవడంతో నీరు బయటకు వెళ్ళడం లేదు. ఇటీవల జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహన్ ఆసుపత్రిని తనిఖీ చేసి పరిస్థితిని తెలుసుకుని ఫిబ్రవరి 28వ తేదీకి డ్రెయిన్ల నిర్మాణం చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఈనెల 19న ఏలూరు ప్రభుత్వాసుపత్రిని సందర్శించి, డ్రెయిన్లను పరిశీలించి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఫస్ట్ ఆబ్జెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ పీఆర్వో వి.దత్తాత్రేయ ఆధ్వర్యంలో శానిటేషన్ సూపర్‌వైజర్ వినోద్ పలువురు కలిసి శానిటరీ పనులను పారిశుధ్య కార్మికులు సోమవారం ఆసుపత్రిలోని డ్రెయిన్లలో పూడికతీత చేపట్టారు. కలెక్టర్ ఆదేశాలతో ఆసుపత్రిలోని డ్రెయిన్లకు మోక్షం కలుగుతుందని అందరూ హర్షం వ్యక్తం చేశారు.

ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి

ఏలూరుసిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజలంతా డిపాజిట్ ఖాతాల గురించి తెలుసుకోవాలని, ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై జాగ్రత్త వహించాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ డి.నీలాద్రి తెలిపారు. స్థానిక ఎస్‌వీఆర్‌కే డిగ్రీ కళాశాలలో రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా, సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు పీడీ వి.అశోక్ కుమార్ పర్యవేక్షణలో సోమవారం నిర్వహించారు. ఎస్ఐ బీఎంవీ రాజా మాట్లాడుతూ సైబర్‌క్రైం పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని, సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నంబరు 1930పై అవగాహన కలిగి ఉండాలన్నారు. సోషల్ మీడియా, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్, మోసపూరిత, ఈ -మెయిల్స్ పట్ల జాగ్రత్త వహించి నష్టపోకుండా ఉండాలని ముఖ్యంగా విద్యార్థులందరూ దీనిపై అవగాహన ఉండాలన్నారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ ఎం.హైందవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవాలని ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, సురక్షా బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలలో నమోదు చేసుకోవాలన్నారు. ఇండియన్ బ్యాంకు చీఫ్ మేనేజర్ పంకజ్‌కుమార్‌మోహన్ సైబర్ నేరాలను వివరించారు. వర్క్‌షాప్‌లో రీసోర్స్ పర్సన్‌లు వై. బాబూరావు, ఎన్.అనిల్, బి.సుమంత్, బి.చెన్నారావు పాల్గొని బ్యాంకు ఖాతా తెరవడం, లావాదేవీలను నిర్వహించడం మొదలైన అంశాలుపై అవగాహన కల్పించారు.

ఫిబ్రవరి 15 వరకు రహదారి భద్రత అవగాహన కార్యక్రమాలు

ఏలూరు క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఈనెల 16 నుంచి ఫిబవరి 15 వరకు జిల్లా వ్యాప్తంగా రహదారి భద్రతా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రవాణాశాఖ మోటారు వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాదరావు తెలిపారు. ఏలూరు ఆర్టీసీ డిపోలో డ్రైవర్లు, క్లీనర్లకు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ నియమాలను పాటించి నిర్దేశించిన వేగం మించకుండా వాహనాలను నడపాలన్నారు. ఉప రవాణా కమిషనర్ కార్యాలయానికి డ్రైవింగ్ లైసెన్సు నిమిత్తం దరఖాస్తు చేసుకుని హాజరైన వారికి రహదారి చిహ్నాలు, రహదారి భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలు తెలిపారు. అనంతరం ఏలూరు పాత బస్టాండ్ వద్ద రోడ్ సేఫ్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహించి హెల్మెట్ లేకుండా, ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న, రాష్ డ్రైవింగ్ చేస్తున్న వారిపై, డ్రైవింగ్ లైసెన్సు లేనివారిపై కేసులు నమోదు చేశారు. ఏలూరు ఆర్టీసీ డిపో మేనేజర్ బి.వాణి, అసిస్టెంట్ మోటారు వెహికల్స్ ఇన్‌స్పెక్టర్లు జగదీష్‌బాబు, ప్రజ్ఞ, అజ్మీరా బద్దు, జమీర్, ఎస్.జగదీష్‌బాబు, జి.స్వామి, కల్యాణి, నరేంద్రబాబు పాల్గొన్నారు.




మాదేపల్లిలో రీ సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది.. మలకచర్లలో అవగాహన ర్యాలీ

రైతులకు న్యాయం చేసేందుకే భూముల రీసర్వే

ఏలూరు రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలనలో భూహక్కు భూరక్షణ పథకం పేరుతో చేపట్టిన భూసర్వే లోపభూయిష్టంగా జరిగింది. రైతులను పిలవకుండానే సర్వే చేసి భూముల సరిహద్దులు, విస్తీర్ణం, సర్వే నంబర్లు మార్చేశారు. ఫలితంగా కొందరికి భూములు తక్కువగాను, మరికొందరికి ఎక్కువగాను చూపించాయి. దీనిపై కూటమి ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ మేరకు రైతులకు పూర్తి న్యాయం జరిగేలా, భూ సమస్య మరోసారి తలెత్తకుండా రైతుల సమక్షంలోనే సోమవారం ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి గ్రామంలో భూ రీసర్వే ప్రారంభమైంది. దీనికోసం పైలట్ ప్రాజెక్టుగా మాదేపల్లి గ్రామాన్ని ఎంపిక చేశారు. తహసీల్దార్ శ్రీనివాస్, సర్వే సిబ్బంది, 48 ఎకరాల్లో సర్వే చేశారు.

మలకచర్లలో అవగాహన ర్యాలీ

దెందులూరు: గతంలో భూమికి సంబంధించి రెవెన్యూ సమస్యలపై జరిగిన తప్పిదాలను శాశ్వతంగా పరిష్కరించేందుకు పైలట్ ప్రాజెక్టుగా మలకచర్ల గ్రామాన్ని తీసుకుని రెవెన్యూ రీ సర్వే నిర్వహించేందుకు అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నామని దెందులూరు తహసీల్దార్ బత్తుల సుమతి అన్నారు. సోమవారం మండలంలోని రామారావుగూడెం శివారు మలకచర్ల గ్రామంలో, మండల సర్వేయర్ గ్రామ రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో రీసర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ కూటమి సభ్యులు, గ్రామస్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కృష్ణారావుపాలెంలో..

జీలుగుమిల్లి : భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దారు సాయిబాబా అన్నారు. రీ సర్వేలో భాగంగా కృష్ణారావుపాలెంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రిసర్వేకు మండలంలో కృష్ణారావుపాలెంను 7వ గ్రామంగా ఎంపిక చేశామన్నారు. రైతులకు ముందస్తుగా నోటీసులు అందించి వారి సహకారంతో సర్వే చేపడతామన్నారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

కొయ్యలగూడెం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్టు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని దిప్పకాయలపాడు గ్రామంలోని రాతిచెరువులో అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారంతో సిబ్బందితో దాడి చేసి రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామన్నారు. వీటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి తహసీల్దార్‌కు అప్పజెప్పగా తహసీల్దార్ ఒక్కో ట్రాక్టర్‌కు రూ.3వేలు చొప్పున జరిమానా విధించారు. అక్రమంగా ఎవరైనా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ, తహసీల్దార్ హెచ్చరించారు.

కుక్క స్వైర విహారం
ముగ్గురు చిన్నారులకు గాయాలు

ద్వారకాతిరుమల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిరుమలంపాలెంలో ఓ కుక్క ఇద్దరు చిన్నారులపై దాడి చేసి తీవ్రంగా గాయపరచింది. గ్రామానికి చెందిన కె.రుషి(7), ఎం.ఆనందపాల్(9) ఉదయం తమ ఇంటి ముందు ఉండగా కుక్క వారిపై దాడి చేసింది. ఈ దాడిలో ఇద్దరు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే బంధువులు వీరిని స్థానిక పీహెచ్‌సీకి తరలించి వైద్యచికిత్స చేయించారు. అదేవిదంగా గుండుగొలనుకుంటలో ఓ పదేళ్ల బాలికపై కుక్క దాడి చేసి గాయపరిచింది. ఈ బాలికను ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యచికిత్స నిమిత్తం తరలించారు. ప్రతీ రోజూ కుక్కల దాడుల కేసులు నమోదు అవుతున్నట్లు వైద్యసిబ్బంది చెబుతున్నారు.

ఇంటర్వ్యూ..

రైతు ప్రయోజనాలను కాపాడుతాం


బలుసు రాధాకృష్ణ
తాళ్లగుంట చిన్నతరహా సాగునీటి చెరువు అధ్యక్షుడు, గుంటుపల్లి

- తాళ్ళగుంట చెరువు పరిధిలో ఎన్ని ఎకరాల విస్తీర్ణం ఉంది ?

జవాబు : 200 ఎకరాల్లో దాదాపు 50 మంది రైతులు ఉన్నారు.

- రైతులకు కలిగే ప్రయోజనాలు ?

జవాబు : చెరువులో నీరు ఎప్పుడూ ఉంటే రెండు పంటలు పుష్కలంగా పండుతాయి. రైతులకు అధిక దిగుబడులు లభిస్తాయి.

- సార్వాలో ఎన్ని ఎకరాల్లో ఏ పంట సాగైంది ?

జవాబు : వరి పంట 90 శాతం పండింది. ఇతర పంటలు పండించేందుకు రైతులు ఆసక్తి చూపలేదు.

- చెరువు అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలేవి ?

జవాబు : ప్రభుత్వాన్ని నిదులు కోరి తీసుకొచ్చి చెరువును అబివృద్ధి చేస్తాం. గట్లు పటిష్టపర్చడం.. తద్వారా అధిక దిగుబడి సాధించేందుకు ప్రోత్సహిస్తాం.

(ఆంధ్రజ్యోతి-కామవరపుకోట)

'గొడౌన్లు, బోర్లకు పరిహారం ఇప్పించాలి'

బుట్టాయగూడెం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జీలుగుమిల్లి-పోలవరం నేషనల్ హైవే రోడ్డు విస్తరణలో భాగంగా భూములు కోల్పోయిన రైతులు తమకు గొడౌన్లు, బోర్లకు పరిహారం ఇప్పించాలని అధికారులను వేడుకుంటున్నారు. సోమవారం రెడ్డిగణపవరంలో రైతులు యాండ్ర శ్రీనివాసరావు, యాదాల నాగేశ్వరరావు, తోణం ప్రసాద్, యాండ్ర ముత్తయ్య, పుసులూరి అచ్యుతరావు మాట్లాడుతూ హైవే రోడ్డు విస్తరణలో భూములను కోల్పోగా అధికారులు నష్టపరిహారం ఇచ్చారని, అవే భూముల్లో ఉన్న గొడౌన్లకు, వ్యవసాయ బోర్లకు పరిహారం ఇవ్వలేదన్నారు. పరిహారం కోసం తహసీల్దార్, ఆర్డీవో, జేసీ కార్యాలయాల చుట్టూ తిరిగినా న్యాయం జరగడం లేదని వాపోయారు. పరిహారం చెల్లించేనాటికి రికార్డుల్లో లేవంటూ అధికారులు చెప్పడాన్ని రైతులు తప్పుబడుతున్నారు. చిన్న, సన్నకారు రైతులైన తమకు పరిహారం ఇవ్వకపోతే నష్టపోతామని అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.


దొరసానిపాడులో మందులు అందిస్తున్న వైద్యులు

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

ద్వారకాతిరుమల, జనవరి 20: పశు సంపదను కబళిస్తున్న గాలికుంటు వ్యాధి నుంచి రక్షణకు, వాటిలో వ్యాధి నిరోధక శక్తి పెంచేందుకు టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ అంగర సురేష్ అన్నారు. దొరసానిపాడు, సాయంపాలెం గ్రామాల్లో సోమవారం ఆయన ఉచిత పశు వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. 30 పశువులకు వైద్యపరీక్షలు జరిపి ఉచితంగా మందులు, 69 పశువులకు నట్టల నివారణ మందులు అందజేశామన్నారు. ఆవులు, గేదెలు, గొర్రెలకు ఈనెల 31 వరకు ఉచితంగా నట్టల నివారణ మందులను అందజేస్తామని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టీడీపీ నేత మద్దిపాటి రత్నాజీ, జి.కొత్తపల్లి పశు వైద్యాధికారి రమేష్, సిబ్బంది, గోపాల మిత్రలు, పాడిరైతులు పాల్గొన్నారు.

వైద్యులను నియమించాలని సీపీఐ సంతకాల సేకరణ

చింతలపూడి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఏరియా ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులు భర్తీ చేయాలని కోరుతూ సీపీఐ నగర కమిటీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ సోమవారం చేపట్టారు. ఈ ఏరియా ఆసుపత్రిలో 23 మంది డాక్టర్లు ఉండాల్సి ఉండగా 11 ఖాళీలు ఉన్నాయని, రోగులు ఇబ్బంది పడుతున్నారని, పోస్టులు భర్తీ చేయాలని పట్టణంలో సంతకాల సేకరణ పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని నాయకులు టి.బాబు, ఎస్.కె.కాలేషా, కంచర్ల గురవయ్య తెలిపారు.

కుక్కునూరు పీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేయాలి

కుక్కునూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కుక్కునూరు పీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ అనుబంధ సంస్థ ప్రగతిశీల మహిళా సంఘం బృందం సోమవారం కుక్కునూరు ప్రాథమిక ఆసుపత్రిని సందర్శించారు. జిల్లా అధ్యక్షుడు చోడే విజయ మాట్లాడుతూ కుక్కునూరు మండలం జనాభా ఎక్కువగా ఉండడం వల్ల ప్రభుత్వ ఆసుపత్రికి ఎక్కువ కేసులు వస్తున్నాయని అన్నారు. అత్యవసర కేసులు వస్తున్నప్పుడు ప్రస్తుతం ఉన్న పది పడకలు సరిపోవడం లేదన్నారు. స్త్రీలు ప్రసవ సమయంలో భద్రాచలం, జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రులకు తీసుకెళుతున్నప్పుడు ప్రాణాపాయ పరిస్థితులు ఎదురవుతున్నాయన్నారు. ఈ క్రమంలో కుక్కునూరు పీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేసి గైనకాలజిస్ట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఎస్‌కే. మున్నీ, రంగమ్మ, సుభద్ర పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాలో 120 మంది ఎంపిక



ఉద్యోగ నియామక పత్రాలను అందజేస్తున్న మంత్రి పార్థసారథి

ఆగిరిపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రానున్న ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలను కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. సోమవారం ఆగిరిపల్లి సమీపంలోని గోపాలపురం ఎన్‌ఆర్‌ఐ కళాశాలలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాకు అపూర్వ స్పందన లభించింది. జాబ్ మేళాను మంత్రి ప్రారంభించారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ చదివిన సూమారు 300 మంది విద్యార్థులకు ఇంటర్వ్యూలను నిర్వహించి 120 మందిని ఎంపిక చేశారు. ఎన్‌ఆర్‌ఐ కళాశాల చైర్మన్ ఆర్. వెంకట్రావ్, కంపెనీ ప్రతినిధులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

కురులు విప్పిన సిరులు



» ద్వారకా తిరుమల చిన్న వెంకన్న ఆలయంలో లక్షల సంఖ్యలో భక్తులు తలనీలాల సమర్పణ

ద్వారకాతిరుమల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్నకు భక్తులు సమర్పించే కురులు సిరులు కురిపిస్తున్నాయి. తమ ఇష్టదైవానికి తలనీలాల సమర్పించడాన్ని భక్తులు అత్యంత పవిత్రంగా భావిస్తారు. ముఖ్యంగా ఏడు కొండలవానికి తలనీలాలు సమర్పిస్తూ దేవదేవుని నిండైన దీవెనలు అందుకుంటున్నారు. ఇందు కోసమే ప్రముఖ క్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి శేషాచలం ఘాట్ రోడ్డులో కోట్లాది రూపాయలు వెచ్చించి దేవస్థానం కల్యాణ కట్టను నిర్మించింది. ఇక్కడే దేవదేవుని తలనీలాల మొక్కును భక్తులు చెల్లించుకుంటారు. ఈ ప్రదేశాన్నే కల్యాణకట్ట అని పిలుస్తారు. హిందూ సంప్రదాయం ప్రకారం శుక్ర, శనివారాల్లో క్షురకర్మ చేయించుకోవడం అపచారంగా భావిస్తారు.. అలాగే సూర్యోదయం తర్వాత మధ్యాహ్న సమయాల్లోనూ క్షురకర్మ చేయించుకోరు ఇది తరతరాల నుంచి వస్తున్న సంప్రదాయం. అయితే శ్రీనివాసుని సన్నిధి నిత్యకల్యాణం.. పచ్చతోరణం.. ఇక్కడ అలాంటి నియమాలు ఉండవు కాబట్టే ఇది కల్యాణకట్టగా ప్రసిద్ధి చెందింది.

పాపాలను దూరం చేసే శ్రీవారు...

పేద, ధనిక అనే భేదం లేకుండా నిత్యం ఏడుకొండలపై తలనీలాలు సమర్పించే భక్తులతో కల్యాణకట్ట కళకళలాడుతూ ఉంటుంది. భక్తుల నుంచి తలనీలాలు తీసుకుని వారి పాపాలు పోగొట్టే శ్రీనివాసుడు కలియుగ ప్రత్యక్ష దైవం గాను, ఆపదమొక్కులవాడిగాను ఖ్యాతి గాంచారు. కోరిన కోర్కెలు తీర్చి భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లే చినవెంకన్నను దర్శించుకునే యాత్రికులు నిత్యం వేలల్లో ఉంటారు. అందుకే విరాళాలు, టిక్కెట్ల రూపంలో ఆర్జించే ఆదాయంతో పాటు భక్తులు తలనీలాల రూపంలో ఆదాయం సమకూరుస్తూ ఉంటారు. వీటి ద్వారా శ్రీవారికి ఏటా కోట్లాది రూపాయల మేర ఆదాయం అందుతోంది..

తలనీలాల వెనుక మర్మమేంటి?

హిందూ సంప్రదాయం ప్రకారం చిన్నా పెద్దా అనే భేదం లేకుండా తమ ఇలవేల్పునకు తలనీలాలు సమర్పించి దైవం ముందు వినమ్రతను చాటుకుంటారు. పురాణాల ప్రకారం మనిషి తన జీవిత కాలంలో చేసిన పాపాలు, అహంకారం శిరోజాలకు అంటి ఉంటాయని, అలాంటి శిరోజాలను స్వామికి సమర్పించి తాము చేసిన పాప కర్మలు తొలగిపోవాలని ఇలా చేస్తుంటారు. వివాహమైన మహిళ భర్త ఉండగా శిరోజాలను తొలగించడం హిందూ సంప్రదాయానికి విరుద్ధం. దీంతో మహిళలు మూడు కత్తెర్ల రూపంలో స్వామికి మొక్కుబడులు చెల్లిస్తుంటారు.

తలనీలాలకు భలే డిమాండ్..

ప్రపంచ మార్కెట్‌లో తలనీలాలకు మంచి గిరాకీ ఉంది. దీంతో వివిధ ఆలయాల్లో వాటిని పోగుచేసుకుని విక్రయించే హక్కునకు ఏటా లేదా రెండేళ్లకోసారి బహిరంగ వేలం నిర్వహిస్తారు. ఈ క్రమంలో శ్రీవారి క్షేత్రానికి వచ్చి మొక్కుబడులు తీర్చుకున్న భక్తుల ద్వారా కోట్లాది రూపాయల మేర ఆదాయం సమకూరుతోంది.. శ్రీస్వామివారికి భక్తులు సమర్పించిన తలనీలల ద్వారా 2023 - 24 సంవత్సరానికి గాను 6 కోట్ల 30 లక్షల రూపాయల ఆదాయం లభించగా 2020-21లో 3 కోట్లు, 2021-22లో ఏకంగా 11 కోట్ల 97 లక్షలు లభించగా 2022-23 సంవత్సరానికి గానూ 6 కోట్ల 37 లక్షల రూపాయల ఆదాయం బహిరంగవేలాల ద్వారా సమకూరింది.

కేటగిరిని బట్టి ధర కేటాయింపు

భక్తులు సమర్పించిన తలనీలాలను వివిధ కేటగిరీల్లో విభజిస్తారు. జుట్టు పొడవు ఆధారంగా 5 అంగుళాల నుంచి 31 అంగుళాల వరకూ ఐదువర్గాలుగా విభజించి విక్రయాలు జరుపుతారు. వేలం వేసిన తర్వాత గుత్తేదారులు ఆ జుట్టును నిల్వ చేయడానికి ముందు పలు జాగ్రత్తలు తీసుకుంటారు. ముందుగా వాటిని ఉడకబెట్టి, కడిగి ఎండలో ఆరబెడతారు. ఆ తర్వాత బస్తాలలో నిల్వ చేసి వాటిని విక్రయిస్తారు. జుట్టు నాణ్యతను బట్టి ధర ఉంటుంది. నాసిరకం కేజీ 8 నుంచి 10 వేల రూపాయల వరకు ధర పలికితే నాణ్యమైన, పొడవైన జుట్టు కేజీ 20 నుంచి రూ.25 వేల రూపాయలు పైబడి ధర పలుకుతుందని వ్యాపారులు చెబుతున్నారు. వీటితో తయారు చేసే విగ్గులు వేల రూపాయలు పలుకుతాయి.. ఇతర దేశాల్లో డిమాండ్ ఉంటుంది.

చారిత్రక ఆనవాళ్లకు సమాధి..

పోలవరం ముంపులో రుద్రమ్మకోట గ్రామం
జరగబోయే ఘటనతో గ్రామస్థుల కంట నీరు
మూడు వేల ఏళ్ల నాటి చరిత్రకు చెల్లు



ఆదిమ మానవుల సమాధి

వేలేరుపాడు, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే నిర్వాసితులకు జరిగే నష్టం అపారం.. ఇదే క్రమంలో వేల సంవత్సరాల చరిత్ర కలిగిన ఆనవాళ్ళు కూడా పూర్తిగా జలసమాధయ్యే ప్రమాదం ఉంది. చరిత్రకు ఆనవాళ్లుగా తమ గ్రామం నిలిచిందని ఆ గ్రామస్థులు అనేక సందర్భాల్లో సంతోషంతో పాటు విచారం వ్యక్తం చేస్తుంటారు. వాళ్ళ సంతోషాలు ఆవిరి చేస్తూ పోలవరం ప్రాజెక్టు తమను మింగేస్తుందని వాపోతున్నారు. మరికొద్ది కాలం లోనే ఆయా ప్రాంతమంతా జలమయం అయ్యి ఊళ్ళకు ఊళ్ళే మునిగిపోనున్నాయి. ఆ కోవలోనే రుద్రమ్మకోట గ్రామం కూడా ఉంది. ఈ గ్రామం ప్రత్యేకత ఏమిటంటే ఆదిమానవులు వేల సంవత్సరాల క్రితమే ఈ గ్రామంలో నివసించినట్లు ఆధారాలున్నాయి.

ఇదీ చరిత్ర...

మూడు వేల ఏళ్ళనాటి ఆదిమానవ ఆనవాళ్ళ ను పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలోని రుద్రమ్మ కోట గ్రామం వద్ద పురావస్తు శాఖ నిపుణులు గుర్తించారు. 2018లో పురావస్తు శాఖ అదికారులు రుద్రమ్మకోట గ్రామ సమీపంలోని గుట్టల వద్ద అతిభారీ సమాధులను గుర్తించారు. ఈ సమాధుల్లో ఏముందో తెలుసుకునేందుకు తవ్వకాలు చేయగా అనేక విశేషాలతో కూడిన ఆది మానవుల ఉనికికి సంబంధించిన వివరాలు బయటపడ్డాయి. క్రీస్తు పూర్వం 1750 నుంచి 2500 సంవత్సరాల మధ్యకాలంలో ఇనుము తొలి సారిగా ఉనికిలోకి వచ్చినట్లు ఇప్పటిదాక భావించారు. అయితే అంతకన్న 500 ఏళ్ళకు ముందే ఇనుప ఖనిజంతో చేసిన సాధనాలను వాడినట్లు సమాధుల్లో బయటపడ్డాయి. ఆది మానవులు గృహ అవసరాల కోసం వాడిని మట్టి పాత్రలు సమాధుల్లో దొరికాయి. వీటితో పాటే స్త్రీ, పురుష అలంకారాల కోసం వాడే పూసలు కూడా లభించాయి.

చరిత్ర చెప్పే సాక్ష్యాలు...

ఆనాటి ఆదిమానవులు భారీకాయులుగా ఉండే వారని నిర్ధారించేందుకు ఇక్కడ సమాధులను పరిశీలిస్తే అర్ధమవుతోంది. చనిపోయినవారిని దహనం చేసిన తరువాత మిగిలిన అస్థికలు, వారువాడిన వస్తువులను ఆరడుగుల వెడల్పు, పది అడుగుల పొడవుగల సమాధులు నిర్మించి వాటిలో భద్రపరిచి రక్షణగా పెద్దబండరాయిని సమాధులపై ఉంచారు. ఇటువంటి సమాధులు అనేకం రుద్రమ్మకోట సమీపంలోని గుట్టల్లో దర్శనమిస్తున్నాయి. ఈ చరిత్ర కలిగిన గ్రామం తన పూర్వపు వైభవాన్ని కోల్పోయే ప్రమాదం పోలవరం ప్రాజెక్టు ద్వారా పొంచి ఉంది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముసునూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు ఎస్‌ఐ ఎం.చిరంజీవి తెలిపారు. ముసునూరు ఏస్సీకాలనీకి చెందిన కొలికిపాము చంటిబాబు(35) తాపీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తూన్నాడు. కొంతకాలంగా భార్యా, భర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 9వతేదీన ఇంట్లో వీరిద్దరి మధ్య తీవ్రంగా గొడవ జరుగగా మనస్తాపానికి గురైన చంటిబాబు ఇంటిలో ఉన్న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చంటిబాబును కుటుంబసభ్యులు నూజివీడు ఏరియా ఆసుపత్రికి అక్కడ నుంచి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ చంటిబాబు మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక పాప ఉన్నారు.

పశువైద్య శిబిరాలు ప్రారంభం



ముదినేపల్లిలో గేదెలకు చూడి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



కైకలూరు మండలంలో పశువులకు ఉచితంగా టీకాలు వేస్తున్న ఏడీ ముస్తఫాఖాన్

ముదినేపల్లి/కలిదిండి/మండవల్లి/కైకలూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం ముదినేపల్లి మండలంలో ఉచిత పశువైద్య శిబిరాలు ప్రారంభమయ్యాయి. ముదినేపల్లిలోని ప్రభుత్వ పశువైద్య శాలలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ క్రాంతి కుమార్, బొమ్మినంపాడు గ్రామంలో డాక్టర్ ఏ.రామకృష్ణ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ శిబిరాల్లో పశువులకు నట్టల నివారణ మందులు వేయటంతోపాటు పాడి గేదెలకు చూడి పరీక్షలను నిర్వహించారు. తొలి రోజు శిబిరాల్లో సుమారు 100 పశువులకు, 250 గొర్రెలు, మేకలకు పలు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కలిదిండి మండలంలోని భాస్కరావుపేట, కొచ్చెర్ల గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించారు. 100 పశువులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 600 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి ప్రహర్ష పాల్గొన్నారు. మండవల్లి మండలంలోని లింగాల, అయ్యవారి రుద్రవరం గ్రామాల్లో సోమవారం 34 పశువులకు, 36 లేగదూడలకు, 120గొర్రెలకు నట్టల నివారణ మందు వేసినట్లు మండవల్లి ప్రాంతీయ పశువైద్య శాల ఏడీ వరప్రసాద్ తెలిపారు. కైకలూరు మండలం వేమవరప్పాడు, శృంగవరప్పాడు గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీ డాక్టర్ పి ముస్తఫాఖాన్ పాల్గొన్నారు.



మిర్చి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త ఫణికుమార్ తదితరులు

నల్ల తామర పురుగుల నివారణకు
చర్యలు పాటించాలి


ముసునూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మిర్చిపంటలో నల్ల తామర పురుగుల నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని ఏలూరు జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఫణికుమార్ అన్నారు. మండలంలోని వలసపల్లిలో మిర్చి పంటలను ఉద్యానవన అధికారిణి కె.జ్యోతి ప్రియాంకతో కలిసి పరిశీలించారు. నల్ల తామర పురుగులు ఉన్నట్లు గుర్తించారు. నివారణకు చేపట్టాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. పురుగు ఉధృతంగా ఉంటే వెంటనే వేపగింజల కషాయం 3 మిల్లీగ్రాములను ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయడం వల్ల గుడ్డు దశలోనే నల్ల తామర పురుగుని నివారించుకోవచ్చని తెలిపారు. ఏవో కె.సీహెచ్ సూరిబాబు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

10 లీటర్ల సారా స్వాధీనం

చాట్రాయి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతనపల్లి చిన్న తండాలో సోమవారం ఎక్సైజ్ పోలీసులు దాడి నిర్వహించి పది లీటర్లు సారా స్వాధీనం చేసుకుని, 500 లీటర్లు బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. పారిపోయిన దారావత్తు శ్రీరాములుపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బోగేశ్వరరావు, ఈఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సత్యవతి, ఎస్సైలు ఈశ్వరరావు, ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు
బీరువా వితరణ

మండవల్లి జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్లచెరువు జెడ్పీ హైస్కూలు ఉపాధ్యాయులు సోమవారం మండల విద్యాశాఖ కార్యాలయానికి రూ.15వేలు విలువ గల బీరువాను అందజేశారు. టీచర్ల సర్వీసు రికార్డులు భద్రపరుచుటకు ఆఫీసులో సౌకర్యం లేకపోవడంతో ఉపాధ్యాయులు స్పందించి బీరువాను వితరణగా ఇచ్చారు. ఎంఈవో-1 డి.రామారావు, ఎంఈఓ-2 ఎస్.రత్నసునాదం పాల్గొన్నారు.



మండవల్లిలో స్వచ్ఛందంగా గుంతలు పూడ్చిన రాముడు

స్వచ్ఛందంగా గుంతలు
పూడ్చిన యువకుడు

మండవల్లి జనవరి 20(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నుంచి మండవల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే రోడ్డులోని పెద్ద గుంతలను ఆటోడ్రైవర్, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యుడు బుద్దుల రాముడు స్థానికుడైన ఆత్మూరి శ్రీనివాసరావుతో కలిసి శ్రమదానం చేసి పూడ్చారు. రహదారి విస్తరణలో ఆసుపత్రి రోడ్డు ధ్వంసం అవ్వడంతో వృద్ధులు, బాలింతలు, గర్భిణులు ఆసుపత్రికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రాముడు స్పందించి గోతులను పూడ్చాడు.

ఎన్నికల డ్యూటీ సర్టిఫికెట్
ఇవ్వాలని వినతి

మండవల్లి జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలంలో సార్వత్రిక ఎన్నికల్లో పీవో, ఏపీవో, ఓపీవోగా పనిచేసిన ఉపాధ్యాయులకు డ్యూటీ సర్టిఫికెట్స్ ఇవ్వాలని మండవల్లి యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకుడు చిరిగిరి పిచ్చోడు సోమవారం తహసీల్దార్‌ను కలిసి కోరారు. ఈ మేరకు మండవల్లి తహసీల్దార్ గోపాల్‌కు మండవల్లి యూటీఎఫ్ శాఖ తరపున వినతిపత్రం అందజేశారు.



రమణక్కపేటలో ఆందోళన చేస్తున్న నాయకులు, కార్మికులు

నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలి

ముసునూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్లు చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని ఏఐసీసీటీయూ జిల్లా కార్యాదర్శి వేముల బక్కయ్య డిమాండ్ చేశారు. సోమవారం రమణక్కపేటలో లిబరేషన్ నాయకులు ఆందోళన చేశారు. బక్కయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నల్ల చట్టాల వల్ల కార్మికులు, కర్షకులు తీవ్రంగా నష్టపోతారని వెంటనే వీటిని రద్దు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధనాలపై ఫిబ్రవరి 24, 25, 26 తేదీల్లో ఢీల్లీలో జరిగే ఏఐసీసీటీయూ 11వ జాతీయ మహాసభ విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు అప్పేవాణి, తోట లక్ష్మీకుమారి, అరుణకుమారి పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలు



రమణక్కపేటలో నట్టల మందు అందజేస్తున్న కూటమి నాయకులు

చాట్రాయి/ముసునూరు, జనవరి 20(ఆంధ్ర జ్యోతి): చాట్రాయి పశువైద్యశాలలో సోమవారం నిర్వహించిన పశువైద్య శిబిరంలో 156 పశువులకు, 400 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేసినట్లు పశువైద్యాధికారి డాక్టర్ శివ నాగేంద్రబాబు తెలిపారు. దూడలకు అంతర పరాన్న జీవుల నిర్మూలన మందులు, చూడి కట్టని పశువులకు చికిత్సలు, గొర్రెలు మేకలకు వ్యాక్సిన్లు,చూడి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి చెప్పారు. ముసునూరు మండలం కాట్రేనిపాడు, రమణక్కపేట గ్రామాల్లో సోమవారం ఉచిత పశువైద్య శిబిరాలను నిర్వహించారు. ముసునూరు పశువైద్యాధికారి డాక్టర్ ఎం.వెంకట చైతన్య పశువులకు గర్భకోశ వ్యాధి వైద్యపరీక్షలు నిర్వహించి, జీవాలకు బొబ్బర వ్యాధి నివారణ టీకాలు వేశారు. నట్టల నివారణ మందును రైతులకు అందజేశారు. సర్పంచ్ గద్దల సుహాసిని మోహన్‌రావు, వేంపాడు మేజర్ చైర్మన్ రాపర్ల బాలకృష్ణ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు రంగు ఆంజనేయులు, జనసేన నాయకుడు పాశం నాగబాబు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలు సమర్థవంతంగా జరగాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాణి

ముసునూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగే 17వ సామాజిక తనీఖీలను సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో జి.రాణి అన్నారు. సోమవారం ముసునూరులో సామాజిక తనిఖీల బృందం సభ్యులు, ఉపాధి హామీ సిబ్బందితో సమన్వయ సమావేశం జరిగింది. 2023 ఏప్రిల్ నుంచి 24 మార్చి వరకు మండలంలో వివిధశాఖల ఆధ్వర్యంలో రూ 15 కోట్లు నిధులతో జరిగిన పనులపై మంగళవారం నుంచి ఆడిట్ బృందాలు తనిఖీలు చేయనున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులు పనులకు సంబంధించిన సమగ్ర రికార్డులను ఆడిట్ సభ్యులకు అందజేయాలని సూచించారు.ఏపీవో రోజీలీల, పీఆర్ ఏఈ దుర్గాప్రసాద్, ఏఎస్‌ఏ ఏఈ బాబురావు తదితరలు పాల్గొన్నారు.

మంత్రికి సహకార ఉద్యోగుల వినతి



మంత్రి అచ్చెన్నాయుడికి సమస్యలు వివరిస్తున్న పీఏసీఎస్ ఉద్యోగుల యూనియన్ నాయకులు

ముదినేపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర సహకార శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును ఆ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు కోరారు. సోమవారం మంత్రిని రాష్ట్ర సచివాలయంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొల్లినేని రఘురామ్ ఆధ్వర్యంలో నాయకులు కలసి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులకు 2019, 2024 పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలని, 2019 ఏప్రిల్ 1 నుంచి సంఘాల్లో సిబ్బంది నియామకాలు నిలిచిపోయాయని, ప్రస్తుతం ఉన్న ఉద్యోగులను రెగ్యులర్ చేసి మిగిలిన ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ఉద్యోగుల రిటైర్‌మెంట్ వయస్సును 62కు పెంచాలని నాయకులు కోరారు. పీఏసీఎస్‌ల ఆడిటింగ్‌ను చార్టర్డ్ అకౌంటెంట్ల ద్వారా నిర్వహిస్తున్నందున సంఘాలపై ఆర్థిక భారం పెరుగుతుందని, సంఘాల ఆడిట్‌ను సహకార శాఖ ద్వారా నిర్వహించాలని కూడా మంత్రిని కోరారు.

వికలాంగుల పింఛన్లు తనిఖీ



చినతాడినాడలో వికలాంగుల పింఛన్లు తనిఖీ చేస్తున్న అధికారులు

కలిదిండి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో వికలాంగుల పింఛన్లను అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి తనిఖీ చేస్తున్నారు. రూ.15 వేలు పింఛను తీసుకుంటున్న 57 మంది వికలాంగులను తొలుత తనిఖీ చేస్తున్నారు. మంచాన పడ్డ వికలాంగుల వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకుని సంబంధిత ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్నారు. వైసీపీ హయాంలో నకిలీ వికలాంగుల పత్రాలతో పింఛన్లు పొందటంపై పలు ఆరోపణలు రావటంపై అధికారులు వికలాంగుల ఇంటికి వెళ్లి తనిఖీలు చేస్తున్నారు.



ప్రజాసమస్యలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్

'25 అర్జీలు వచ్చాయి'

నూజివీడు టౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. వేదికలో మొత్తం 25 అర్జీలు వచ్చాయని, అర్జీలను సంబంధిత అధికారులకు పంపి నిర్ణీత సమయంలోగా సమస్యలు పరిష్కరించాలని ఆదేశిస్తామని సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ చెప్పారు.



అక్కిరెడ్డిగూడెంలో రీ సర్వే చేస్తున్న అధికారులు

రీ సర్వే పైలట్ ప్రాజెక్ట్‌గా
అక్కిరెడ్డిగూడెం

ముసునూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో అక్కిరెడ్డిగూడెం గ్రామాన్ని రీ సర్వే పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రభుత్వం ఎంపిక చేసింది. సోమవారం గ్రామ సర్వేయర్లు, రెవెన్యూ అధి కారులు సర్వే ప్రారంభించారు. ఒక బృందం ప్రభుత్వ స్థలాల హద్దులను నిర్ణయించే ప్రక్రియ చేపట్టారు. మరో రెండు బృందాలు రైతుల పొలాల సరిహద్దులు, విస్తీర్ణం తదితర వాటిని సర్వే చేస్తున్నారు. డీటీ పురుషోత్తమశర్మ పరిశీలించారు.



ధ్వంసమైన కంప్యూటర్

పాఠశాలలో
కంప్యూటర్ ధ్వంసం

నూజివీడు టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సెలవులు సమయంలో మండలంలోని పోతురెడ్డిపల్లి మండల పరిషత్ పాఠశాలలో గుర్తుతెలియని ఆకతాయిలు బీభత్సం సృష్టించారు. పాఠశాలలోని కంప్యూటర్ గది తాళాలు పగలగొట్టి గదిలో ఉన్న కంప్యూటర్‌ను బయటకు తీసుకువచ్చి ధ్వంసం చేశారు. పాఠశాలలో విద్యార్థులు తాగునీటి కోసం వాడే పైప్‌లైన్ ట్యాపులు సైతం ధ్వంసం చేసినట్లు హెచ్‌ఎం చెప్పారు. గతంలో గ్రామానికి చెందిన సీపీఐ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు కుమార్తె డాక్టర్ సంధ్య దంపతులు కంప్యూటర్లను అందజేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు హెచ్‌ఎం అన్నారు.

సెంట్రింగ్ మేస్త్రి మృతి

నూజివీడు టౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని బత్తులవారిగూడెంలో సోమవారం విషాదం చోటుచేసుకుంది. సుంకొల్లు గ్రామానికి చెందిన గోళ్ళ వీరాంజనేయులు (26) సెంట్రింగ్ ఏర్పాటు చేస్తుండగా కర్రలు విరిగి మీదపడి గాయపడ్డాడు. నూజివీడు అమెరికన్ హస్పటల్‌కి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



లయన్స్‌క్లబ్ మగువ కార్యవర్గ సభ్యులుగా నియమితులైన మహిళలు

కైకలూరు లయన్స్‌క్లబ్ మగువ కార్యవర్గం

కైకలూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కైకలూరు లయన్స్‌క్లబ్ మగువ ద్వారా సేవలను విస్తృతం చేయాలని లయన్స్‌క్లబ్ మల్టీపుల్ చైర్‌పర్సన్ దామర్ల శ్రీశాంతి అన్నారు. సోమవారం కైకలూరులో లయన్స్ క్లబ్ ఆఫ్ కైకలూరు మగువ నూతన కార్యవర్గం నియామకమైంది. విజయవాడ లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ పైడిమర్రి రామకృష్ణ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. కైకలూరు లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్‌గా సొల్లేటి మాధవి, కార్యదర్శిగా కనిశెట్టి మాధవి, ట్రెజరర్‌గా మెంటా మాధవిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ గద్దె శేషగిరిరావు, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆంజనేయులు, దుర్గామల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

చాట్రాతి అవినాష్ విజయ్ తండ్రి కృష్ణారావు పేరుతో గల పాస్ పోర్ట్ No. R7203744 జిరాక్స్ నిమిత్తం పెద్దగాంధీ బొమ్మ సెంటర్‌కి వెళ్లి వస్తుండగా ఈ నెల 12 తేదీ పోయినది. దొరికిన వారు ఈ క్రింది నెంబర్ కు తెలియజేయగలరు
సెల్: 9491727662